



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 296 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శుక్రవారం | 13-02-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00




ఫలితాలపై అభ్యర్థులలో ఉత్కంఠ

# ఎవరికి ఎన్ని స్థానాలు?

- ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ప్రధాన పార్టీలు
- ఎక్కడా తగ్గకుండా పెద్ద ఎత్తున ప్రచారాలు
- ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తిచేసిన ఈసీ
- ఉదయం 8 గంటల నుంచి జరగనున్న లెక్కింపు

## నేడే మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు

**హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో ఓట్ల లెక్కింపునకు ఎన్నికల సంఘం విస్తృత ఏర్పాట్లు చేసింది. బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమైన ఓటర్ల తీర్పు నేడు వెల్లడి కానుంది. ఉదయం 8 గంటల 123 కేంద్రాల్లో లెక్కింపు జరగనుంది. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాల్టీల్లో 28 లక్షల 4వేల 274 ఓట్లు 7 కార్పొరేషన్లలో లక్ష 5 వేల 132 ఓట్లు లెక్కించాల్సి ఉంది. స్ట్రాంగ్ రూముల్లో 16 వేల 31 బ్యాలెట్ బాక్సుల్లో ఓట్లను భద్రపరిచారు.ఓట్ల లెక్కింపు ప్రక్రియ, ఫలితాల వెల్లడికి సంబంధించిన మార్గదర్శకాలపై అధికారులకి రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుతో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభంకానుంది. ఆ తర్వాత బ్యాలెట్ బాక్సుల్లోని ఓట్లు లెక్కిస్తారు. పోలింగ్ కేంద్రం వారీగా -మిగతా 2 లో



### రాబోయే పదిన్నరేళ్ల పాటు


# నేనే సీఎం

## 2029 ఏప్రిల్‌లో జమిలి ఎన్నికలు



- అప్పుడే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు
- నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుంది
- ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని ప్రతిపాదిస్తా
- నా ప్రభుత్వంలో ఫోన్ ట్యాపింగ్ అనేది లేదు
- కిషన్ రెడ్డి లేఖ రాస్తే ఫోన్ ట్యాపింగ్ కేసు సీబీఐకి
- నిబంధనల ప్రకారమే సింగరేణి టెండర్లు
- ఢిల్లీలో మీడియాతో ఇష్టాగోష్టిలో రేవంత్ రెడ్డి


**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
2029 ఏప్రిల్‌లో జమిలి ఎన్నికలు జరుగుతాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. అప్పుడే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ఉంటాయని పేర్కొన్నారు. నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందని ఆయన వెల్లడించారు. నూటికి నూరు శాతం తన ప్రభుత్వంలో ఫోన్ ట్యాపింగ్ లేదని స్పష్టం చేశారు. ఢిల్లీలో మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడిన రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. -మిగతా 2 లో



# ఎర్రకోట దాడి వెనుక జైషే హస్తం..

- నవంబర్ 9 నాటి దాడిలో 15 మంది మృతి
- జైషేపై ఐరాస సంచలన నివేదిక వెల్లడి

**న్యూఢిల్లీ**
పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న జైషే మహమ్మద్ (జేఈఎం) ఉగ్రవాద సంస్థపై ఐక్యరాజ్యసమితి (యూఎన్) సంచలన నివేదికను విడుదల చేసింది. గతేడాది ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన ఉగ్రదాడి వెనుక జైషే హస్తం ఉందని, ఆ సంస్థ మహిళలతో ప్రత్యేకంగా ఒక ఉగ్రవాద విభాగాన్ని కూడా ఏర్పాటు చేసిందని ఈ నివేదిక స్పష్టం చేసింది. ఐరాస భద్రతా మండలికి చెందిన ఆల్-ఖైదా, ఐసిస్ ఆంక్షల పర్యవేక్షణ బృందం ఈ నివేదికను రూపొందించింది. 2025 నవంబర్ 9న ఢిల్లీ ఎర్రకోట వద్ద జరిగిన దాడిలో 15 మంది మరణించారని, ఈ ఘటనతో జైషే మహమ్మద్‌కు సంబంధం ఉన్నట్లు తమకు సమాచారం అందిందని పేర్కొంది. ఈ దాడితో పాటు మరికొన్ని దాడులకు జైషే బాధ్యత వహించినట్లు ఒక సభ్య దేశం తెలిపినట్లు నివేదికలో పొందుపరిచారు. అంతేకాకుండా జైషే చీఫ్, అంతర్జాతీయ ఉగ్రవాది మసూద్ అజార్ 2025 అక్టోబర్ 8న 'జమాత్ ఉల్-ముమినత్' పేరుతో మహిళా విభాగాన్ని అధికారికంగా ప్రకటించినట్లు నివేదిక తెలిపింది. ఉగ్రవాద దాడులకు మద్దతు ఇవ్వడమే లక్ష్యంగా ఈ విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. అయితే, ఈ నివేదికలో మరో ఆసక్తికరమైన అంశం వెలుగులోకి వచ్చింది. ఒక సభ్య దేశం (పాకిస్థాన్ అని భావిస్తున్నారు) మాత్రం జైషే సంస్థ ఎప్పుడో 'నిర్వీర్యం' అయిపోయిందని వాదించింది. నివేదికలో జైషే ప్రస్తావనపై పాకిస్థాన్ తీవ్ర నిరసన వ్యక్తం చేసినట్లు సమాచారం. పాకిస్థాన్ వాదన ఎలా ఉన్నప్పటికీ, జైషే మహమ్మద్ ఇప్పటికీ చురుకుగా కార్యకలాపాలు సాగిస్తోందని, అంతర్జాతీయ భద్రతకు ముప్పుగా పరిణమించిందని ఈ నివేదిక స్పష్టం చేస్తోంది.




# పంచాయితీలకు మరో రూ.387 కోట్లు విడుదల

- ఫలించిన మంత్రి సీతక్క వినతి
- మొదటి విడతగా ఇప్పటికే రూ. 259.36 కోట్లు విడుదలైన విషయం తెలిసిందే
- తెలంగాణకు 15వ ఆర్థిక సంఘం కింద సుమారు రూ. 3,000 కోట్లు పెండింగ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
:గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం కింద రూ.387 కోట్లని కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. మొదటి విడతగా ఇప్పటికే రూ. 259.36 కోట్లు విడుదలైన విషయం తెలిసిందే. తాజా విడతతో కలిపి మొత్తం నిధులు రూ. 646.36 కోట్లు విడుదలయ్యాయి. తెలంగాణకు 15వ ఆర్థిక సంఘం కింద సుమారు రూ. 3,000 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. గ్రామపంచాయతీ ఎన్నికలు పూర్తి చేసి, కేంద్రం కోరిన సమాచారాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, -మిగతా 2 లో

# నాపై కేసులు పెట్టినా వెనక్కి తగ్గను

- టంప్ చేతుల్లో నరేంద్ర మోదీ పగ్గాలు ఉన్నాయి
- ఆ ట్రేడ్ డీల్ వల్ల దేశ రైతులు నష్టపోతారు
- రైతుల రక్తాన్ని ట్రంప్‌నకు మోదీ అమ్మేశారు
- నరేంద్ర మోదీపై తీవ్ర విమర్శలు చేసిన రాహుల్



**న్యూఢిల్లీ**
ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విరుచుకుపడ్డారు. తనపై కేసులు పెట్టినా, ప్రివిలేజ్ మోషన్ దాఖలు చేసినా తాను పట్టించుకోనని అన్నారు. తాను దేశ రైతుల కోసం పోరాడుతానని తెలిపారు. అలాగే భారత్- అమెరికా ట్రేడ్ ద్వారా ప్రధాని మోదీ దేశాన్ని, రైతులను అమ్మేశారని ఆరోపించారు. ఈ క్రమంలో మోదీని రైతు వ్యతిరేకిగా అభివర్ణించారు. యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేతుల్లో నరేంద్ర మోదీ పగ్గాలు ఉన్నాయని ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఎక్స్‌లో తాను మాట్లాడిన ఓ వీడియోను రాహుల్ పోస్టు చేశారు.రైతుల జీవనోపాధిని హరించే లేదా దేశ ఆహార భద్రతను బలహీనపరిచే ఏ వాణిజ్య ఒప్పందం అయినా అన్నదాతలకు వ్యతిరేకమే. -మిగతా 2 లో



# ఉత్తర కొరియా వారసురాలిగా కిమ్ జు యే..

- కూతురును ఎంపిక చేసిన కిమ్ జోంగ్ ఉన్
- మూడు తరాలుగా కిమ్ కుటుంబం చేతిలోనే ఉత్తర కొరియా నాయకత్వం
- దీంతో ఇకపై కూడా నాలుగో తరానికి నాయకత్వ బాధ్యతలు అప్పగించాలని కిమ్ భావిస్తున్నారు.
- కిమ్ కూతురు వయసు 13 ఏళ్లు.

2 లో



# నాలుగేళ్ల మోడీ విదేశీ ఖర్చు రూ. 462.58కోట్లు

- 2021-2025 మధ్య ప్రధాని మొత్తం 43 దేశాలను పలుమార్లు సందర్శించారు.
- వీటిలో అత్యధికంగా ఖర్చు చేసింది అమెరికా పర్యటనలకే.

2 లో



# భారత వాయుసేన మరింత బలోపేతం..

- 114 రఫేల్ విమానాల కొనుగోలుకు డీఏసీ అనుమతి
- ఆపరేషన్ సింధూర్ సమయంలో పాకిస్థాన్ కు వణుకు పుట్టించిన రఫేల్ యుద్ధ విమానాలు
- భారత వాయుసేన దగ్గర ఇప్పటికే 36 రఫేల్ యుద్ధవిమానాలు
- మరింత పెంచుకోవాలని భారత్ భావిస్తున్నది

**న్యూఢిల్లీ ఫిబ్రవరి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆపరేషన్ సింధూర్ సమయంలో పాకిస్థాన్ కు వణుకు పుట్టించిన రఫేల్ యుద్ధ విమానాల సంఖ్య మరింత పెంచుకోవాలని భారత్ భావిస్తున్నది. అందులో భాగంగా ఫ్రాన్స్ నుంచి యుద్ధ విమానాల కొనుగోలు విషయమై రక్షణ శాఖ చేసిన ప్రతిపాదనకు కేంద్రం ఓకే చెప్పింది.రూ.3.25 లక్షల కోట్ల వ్యయంతో ఫ్రాన్స్‌తో అతిపెద్ద రక్షణ ఒప్పందం చేసుకునేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఫ్రాన్స్ నుంచి 114 రఫేల్ యుద్ధ విమానాలను కొనుగోలు చేసేందుకు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ ఆమోదం తెలిపినట్లు -మిగతా 2 లో

### తెలంగాణ జాగృతి పార్టీ

# పెట్టడం పక్కా

## ఉద్యమకారులకు అన్యాయం జరిగింది



- ఊహించిన దానికి భిన్నంగా నిర్ణయాలు
- అందుకే మళ్లీ పోరాటం చేయాల్సి వస్తోంది
- కోదండరామ్ లాంటి వారు ఆలోచన చేయాలి
- తన పక్కన పైరవీకారులు లేరన్న కవిత

**హైదరాబాద్ ఫిబ్రవరి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తాను కచ్చితంగా రాజకీయ పార్టీని స్థాపిస్తానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. తెలంగాణ పేరుతోనే పార్టీ ఉంటుందని పేర్కొన్నారు. జాగృతి రాజకీయ శక్తిగా మారుతుందని తెలిపారు. స్వీయ అస్థిత్వం, ఉద్యమ ఆకాంక్షలు, తెలంగాణ వాదాన్ని నిలబెట్టుకోవడం కోసమే రాజకీయ పార్టీని స్థాపిస్తున్నట్లు పేర్కొన్నారు. తమ పార్టీ ఫక్తు రాజకీయ పార్టీగా ఉండదని కుండబద్దలు కొట్టారు. రాజకీయ పార్టీ స్థాపిస్తానంటే.. -మిగతా 9 లో

# పంచాయితీలకు మరో రూ.387 కోట్లు విడుదల

మొదటి తరువాయి

గ్రామీణ అభివృద్ధి శాఖ సమర్పించింది. ఇందుకు అనుగుణంగా విడతలవారీగా కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఇంకా సుమారు రూ. 2,400 కోట్లు విడుదల కావాల్సి ఉంది. గ్రామాల అభివృద్ధి కోసం పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని కేంద్రానికి తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు.

# నాపై కేసులు పెట్టినా వెనక్కి తగ్గను

మొదటి తరువాయి

రైతు వ్యతిరేక మోదీ ప్రభుత్వాన్ని ఆహార సరఫరాదారుల ప్రయోజనాలపై రాజీ పడనివ్వం. నిన్న(బుధవారం) నేను పార్లమెంటులో నిజం మాట్లాడాను. మీకు (ప్రభుత్వానికి) నచ్చకపోతే అది వేరే విషయం. దేశం సత్యాన్ని అర్థం చేసుకోగలదు. నేను రైతులపక్షాన నిలబడతాను. అస్సలు వెనక్కి తగ్గను. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ, నేను రైతులకు అండగా ఉంటాం. వారిని అన్యాయం జరగనివ్వమని అన్నారు. రైతులే దేశానికి పునాది అని రాహుల్ గాంధీ తెలిపారు. అమెరికాతో ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా ప్రధాని మోదీ దేశంలోని పత్తి, సోయాబీన్స్, యాపిల్, పండ్ల రైతులను అమ్మేశారని ఆరోపించారు. కొన్నేళ్లుగా విదేశీయులు దేశ వ్యవసాయ మార్కెట్‌ను స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని, వారికి నరేంద్ర మోదీ ఈ ట్రేడ్ డీల్ ద్వారా ద్వారాలు తెరిచారని మండిపడ్డారు. ఇది నిజమని, ఈ విషయం మోదీకి కూడా తెలుసని విమర్శించారు. మోదీ తన మిత్రులైన అదానీ, అంబానీ, విదేశీ శక్తుల కోసం మొత్తం దేశ వ్యవసాయ మార్కెట్‌కు తలుపులు తెరుస్తారని ఆరోపించారు. మోదీ రైతు వ్యతిరేకి అని ఈ విషయం యావత్ దేశానికి, అన్నదాతలకు తెలుసని పేర్కొన్నారు.విదేశీ వ్యవసాయ ఉత్పత్తులకు భారత మార్కెట్ ద్వారాలు తెరవడం దేశ ఆహార భద్రత, రైతుల జీవనోపాధిపై చేసిన ప్రత్యక్ష దాడిగా రాహుల్ అభివర్ణించారు. పత్తి, సోయాబీన్స్, జొన్నలు, పండ్ల రైతులు ఇప్పటికే ప్రమాదంలో ఉన్నారన్నారు. దేశంలోని 99.5 శాతం మంది పేద, సన్నకారు రైతులే ఉన్నారని వెల్లడించారు. వారు పండించే పంటలకు మద్దతు ధర ఉండదని, సబ్సిడీలు కూడా అందవని పేర్కొన్నారు. ఈ క్రమంలో దేశ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. అమెరికాలో వ్యవసాయం యంత్రాలను ఉపయోగించి చేస్తారని, వారికి ప్రభుత్వం భారీ సబ్సిడీలను అందిస్తుందన్నారు.

# భారత వాయుసేన మరింత బలోపేతం..

మొదటి తరువాయి



ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. కాగా ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ఈ నెల 18న భారత పర్యటనకు రానున్నారు. ఈ నేపథ్యంలోనే తాజా డీల్‌కు ఆమోదం లభించడం గమనార్హం. ఈ 114 రఫేల్ యుద్ధ విమానాల్లో 88 సింగిల్ సీటర్, 26 ట్విన్ సీటర్ వేరియంట్‌లు ఉన్నాయి. అదేవిధంగా మేక్ ఇన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా స్థానికంగా తయారీ, అసెంబ్లింగ్ వంటి వాటి కోసం ఫ్రాన్స్‌కు చెందిన రఫేల్ మాతృ సంస్థ డసో ఏవియేషన్.. భారత్‌లోని ప్రైవేట్ సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకోనుంది. కాగా భారత వాయుసేన దగ్గర ఇప్పటికే 36 రఫేల్ యుద్ధవిమానాలు ఉన్నాయి.

# నాలుగేళ్ల మోడీ విదేశీ ఖర్చు రూ. 462.58కోట్లు

**2021-2025 మధ్య ప్రధాని మొత్తం 43 దేశాలను పలుమార్లు సందర్శించారు.**

**వీటిలో అత్యధికంగా ఖర్చు చేసింది అమెరికా పర్యటనలకే.**




**న్యూఢిల్లీ,**

గత నాలుగేళ్లుగా అంటే 2021-2025ల మధ్య కాలంలో ప్రధాని మోడీ విదేశీ ప్రయాణాల కోసం అక్షరాలా రూ. 462.58కోట్లు ఖర్చు చేసింది. 2021-2025 మధ్య ప్రధాని మొత్తం 43 దేశాలను పలుమార్లు సందర్శించారు. వీటిలో అత్యధికంగా ఖర్చు చేసింది అమెరికా పర్యటనలకే. మొత్తం వ్యయంలో 16శాతం (74.4కోట్లు) నాలుగుసార్లు అమెరికా సందర్శనలకు ఖర్చు చేశారు. వ్యయం పరంగా జపాన్, ఫ్రాన్స్‌లు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. జపాన్, ఫ్రాన్స్‌ల కోసం మొత్తం వ్యయంలో సుమారు 9శాతం ఖర్చు చేశారు. 2025లో ఫ్రాన్స్ సందర్శన అత్యంత ఖరీదైన పర్యటనగా నిలవనుంది. ప్రధాని మోడీ ఒక్కరే వెళ్లిన ఈ పర్యటన కోసం సుమారు 25.5కోట్లు ఖర్చు చేసినట్లు సమాచారం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యాక్షన్ సమ్మిట్‌లో పాల్గనడంతో పాటు మార్సెయిల్‌లో భారత రాయబార కార్యాలయాన్ని ప్రారంభించారు. 2023 జూన్‌లో అమెరికా పర్యటనకు రూ.22.8కోట్లు వ్యయం కాగా, 2021 సెప్టెంబర్‌లో అమెరికా సందర్శనకు రూ.19.6 కోట్లు ఖర్చు చేశారు. ఈసందర్శనల ఉద్దేశ్యం క్వాడ్ సదస్సు, ఐక్యరాజ్యసమితిలో ప్రసంగించడం. అమెరికా, యుఎఇ, జపాన్‌లలో ఒక్కో దేశాన్ని నాలుగు సార్లు సందర్శించారు. ఫ్రాన్స్‌ను మూడు సార్లు, బ్రిటన్, రష్యా, బ్రెజిల్, దక్షిణాఫ్రికాల్లో ఒక్కోదేశాన్ని రెండు సార్లు సందర్శించారు. దౌత్య సంబంధాల బలోపేతం కోసం ఈ పర్యటనలు చేసినట్లు ప్రధాని మోడీ పేర్కొన్నప్పటికీ.. దేశంలో ఓ వైపు ఇప్పటికీ ఆహారం, వసతి కోసం ఇబ్బందిపడుతుండటం గమనార్హం. ఈ సందర్శనల కోసం వినియోగించే ప్రభుత్వ వ్యయాన్ని ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికోసం ఖర్చు చేయాలని పలువురు మేథావులు, నిపుణులు పేర్కొంటున్నారు.విదేశీ ప్రయాణాల కోసం అత్యధదిక వ్యయంపై ప్రతిపక్షాలు గతంలో ప్రశ్నలు లేవనెత్తిన సంగతి తెలిసిందే.

# ఎవరికి ఎన్ని స్థానాలు?

మొదటి తరువాయి

25 బ్యాలెట్ పత్రాలని ఒక బండిల్‌గా చేసి లెక్కింపు చేపట్టనున్నారు. ఒక్కో రౌండ్‌కు 40 కట్టలు అంటే వెయ్యి ఓట్లను కౌంటింగ్ టేబుల్‌కు పంపిస్తారు. ఓట్లను ఏజెంట్లకు చూపించి అభ్యర్థుల వారీగా ట్రేలో వేస్తారు. అభ్యర్థులకు వచ్చిన ఓట్లను 100 చొప్పున బండిల్ చేస్తారు. రౌండ్లు, టేబుళ్ల వారీగా అభ్యర్థులు నోటా, చెల్లని ఓట్ల వివరాలు నమోదు చేసి చివరకి ఫలితాలు ప్రకటించనున్నారు.ఓట్ల లెక్కింపు కోసం సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లని రాష్ట్ర ఎన్నికల సంఘం శిక్షణ ఇచ్చింది. కౌంటింగ్ కేంద్రాల పరిసరాల్లో 163 సెక్షన్ అమల్లో ఉంటుంది. కౌంటింగ్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు, అభ్యర్థులు, వారి ఏజెంట్లకు మాత్రమే ఓట్ల లెక్కింపు కేంద్రాల్లోకి అనుమతి ఉంటుందని ఎస్?ఈసీ స్పష్టంచేసింది. మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తులకు కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతి లేదని తెలిపింది. ఓట్ల లెక్కింపు ప్రక్రియను వెబ్‌కాస్టింగ్ ద్వారా ఎస్?ఈసీ, డీజీపీ, కలెక్టర్ల కార్యాలయాల్లో ఉన్నతాధికారులు పరిశీలించనున్నారు. బుధవారం జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పట్టణాలు, నగరాలన్నీ కలిపి 73.01 శాతం పోలింగ్ నమోదైంది. మున్సిపాలిటీల్లో 75.88, కార్పొరేషన్లలో 66.05 శాతం మంది ఓట్లు వేశారు. మున్సిపాలిటీల్లో అత్యధికంగా చౌటుప్పల్‌లో 91.91 శాతం, అతి తక్కువగా నందికొండలో 59.68 శాతం పోలింగ్ నమోదైంది. చౌటుప్పల్‌తో పాటు చండూరు, జిన్నారం, పోచంపల్లి మున్సిపాలిటీల్లో 90 శాతానికిపైగా ఓటర్లు ఓటు వేశారు. 46 మున్సిపాలిటీల్లో 80 శాతం, 51 మున్సిపాలిటీల్లో 70 శాతం, 15 మున్సిపాలిటీల్లో 60 శాతం దాటింది. రెండు కార్పొరేషన్లలో పోలింగ్ 70 శాతానికి పైగా, నాలుగింటిలో 60 శాతానికి పైగా నమోదైంది. కార్పొరేషన్లలో నల్గొండలో 77.36 శాతం, కొత్తగూడంలో 74.52, రామగుండంలో 69.32, మహబూబ్‌నగర్‌లో 67.73, మంచిర్యాలలో 64.90, కరీంనగర్‌లో 62.98, నిజామాబాద్‌లో 59.12 శాతం పోలింగ్ జరిగింది. పట్టణాలు, నగరాల్లో పురుషుల కంటే మహిళలు ఎక్కువగా ఓటింగ్?లో పాల్గొన్నారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లన్నింటిలో కలిపి పురుషులు 72.63 శాతం ఓట్లేయగా, మహిళలు 73.39 శాతం మంది ఓటు వేశారు.రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీల్లోని 2 వేల 582 వార్డుల్లో 13 లక్షల 61 వేల 285 మంది పురుషులు, 14 లక్షల 42 వేల 751 మంది మహిళలు, 238 మంది ట్రాన్స్‌జెండర్లు ఓట్లు వేశారు. ఏడు కార్పొరేషన్లలో 4 లక్షల 90 వేల 544 మంది పురుషులు, 5 లక్షల 14 వేల 475 మంది మహిళలు, 113 మంది ట్రాన్స్‌జెండర్లు ఓట్లు వేశారు. పోలింగ్



సరళిని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో ఎస్ఈసీ రాణికుముదిని, సీడీఎంఏ కార్యాలయంలో పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి టీకే శ్రీదేవి నిరంతరం పర్యవేక్షించి, క్షేత్రస్థాయిలో అవసరమైన విషయాలను ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేశారు. మున్సిపల్? ఎన్నికల పోలింగ్ పూర్తయిందని ఊపిరి పీల్చుకున్న రాజకీయ పార్టీల నేతలు, అభ్యర్థులు తమకు ఎన్ని ఓట్లు పడ్డాయోనని అంచనా వేసుకుంటున్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్?ఎస్? పార్టీలు ఈ పురపాలక ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ఎక్కడా తగ్గకుండా పెద్ద ఎత్తున ప్రచారాలు నిర్వహించాయి. ఇప్పుడు వెలవడనున్న ఫలితాలపై అన్ని పార్టీల అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది. తమ అభ్యర్థుల గెలుపు, ఓటములు ఎలా ఉండబోతున్నయి? అసలు ఓట్లు ఎన్ని పడ్డాయి. మెజార్టీ ఎంత వస్తుంది? అనే ప్రశ్నలలో మునిగి తేలుతున్నారు. పోలింగ్ బూత్‌ల వారీగా పడిన ఓట్లు, ఏజెంట్ల వద్ద ఉన్న వివరాలతో కాలనీల వారీగా ఎవరెవరు ఓట్లు తమకు వేశారోనని పలు విశ్లేషణలు చేసుకుంటున్నారు. పోలింగ్ సరళిని పార్టీల నాయకత్వాలకు వివరిస్తున్నారు. ఇప్పటికే కొందరు ఎగ్జిట్ పోల్స్ అంటూ కొన్ని మున్సిపాలిటీల్లో ఎవరికి ఎన్ని స్థానాలు వస్తాయి? ఎవరు మున్సిపల్? ఛైర్మన్?లను గెలుచుకోనున్నారో? అనే విషయాలను అంచనా వేసి చెబుతున్నారు. అనుకూలంగా ఉండే సర్వేలకు తెగ ఆనందపడిపోతున్నారు. ప్రతికూలంగా ఉంటే మీ సర్వే తప్పు అని కొట్టి పారేస్తున్నారు.

మరోవైపు మక్తల్ మున్సిపాలిటీలో మొత్తం వార్డుల సంఖ్య 16. సంబంధిత కౌన్సిలర్ స్థానాలకు ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్లు వేశారు. ఈ క్రమంలో పోలింగ్‌కు ఒక రోజు ముందు అంటే ఫిబ్రవరి 10వ తేదీన 6వ వార్డు నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి ఎరుకలి మహదేవప్ప అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోవడంతో దుమారం చెలరేగింది. ఆ వెంటనే బీజేపీ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, కాంగ్రెస్? నాయకుల బెదిరింపుల వల్లే మహదేవప్ప చనిపోయారని ఆరోపణలు చేశారు. కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి, ఎంపీ డీకే అరుణ, బీజేపీ చీఫ్ రామచందర్?రావు దీనిని కాంగ్రెస్ చేసిన హత్యనే అని ఆరోపించారు. ఆ వెంటనే పరిస్థితిని గమనించిన ఎన్నికల అధికారులు వార్డులో ఎన్నికను వాయిదా వేశారు. దీంతో మక్తల్?లో మున్సిపల్ ఎన్నికలు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ నేపథ్యంలో 6వ వార్డు ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారు? అసలు ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ ఎన్నిక ఈ నెల 16వ తేదీన ఉంటుందా? ఉండదా? అనే విషయాలు ప్రస్తుతం ఆసక్తికరంగా మారాయి.మక్తల్ 6వ వార్డు తప్ప బుధవారం మిగతా 15 చోట్ల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. స్టేట్? ఎలక్షన్? కమిషనర్? నిబంధనల ప్రకారం బుధవారం 15 వార్డులకు నిర్వహించిన ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు ప్రక్రియ సాధారణంగానే ఈ నెల 13న కొనసాగనుంది. లెక్కింపు అనంతరం ప్రధాన రాజకీయ పార్టీల బలబలాలు బయటపడనున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకొని, ఫలితాల రోజు అంటే ఫిబ్రవరి 13న మూడు అంచెలతో పోలీసుల భద్రత మరింత కట్టుదిట్టంగా, పటిష్ఠంగా ఏర్పాటు చేస్తున్నారని సమాచారం.6వ వార్డు ఎన్నిక, ఫలితం మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికలో కీలకం అయితే చందాపూర్, తిరుమలాపూర్ గ్రామ ఓటర్లతో పాటు బరిలో నిలిచే అభ్యర్థుల ఖర్చు అమాంతం రెట్టింపు అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మరోవైపు ఎక్స్ అఫీషియో ఓటర్ల (ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు) నమోదు, ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ల ఎంపిక ఇంతకు ముందు ప్రకటించిన తేదీల ప్రకారం జరుగుతాయా? లేదా అని అన్ని పార్టీల రాజకీయ నాయకుల్లో సందేహం నెలకొంది. మక్తల్?లో మరణించిన ఘటనపై మంత్రి వాకిటి శ్రీహరి మరోసారి స్పందించారు. 6వ వార్డు బీజేపీ అభ్యర్థి మృతితో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. మహదేవప్పకు తానెప్పుడూ ఫోన్ చేయలేదని, ఏమైనా సందేహం ఉంటే కాల్ డేటా కూడా పరిశీలించాలని కోరారు. తనపై వస్తున్న ఆరోపణలు రుజువైతే దేనికైనా సిద్ధమని ఆయన తేల్చి చెప్పారు. పోస్ట్‌మార్టమ్ రిపోర్ట్ తర్వాత అసలు కారణాలు తెలుస్తాయన్న మంత్రి, ఎన్నికల భయంతో మహదేవప్ప చనిపోయారని కుటుంబసభ్యుల అభిప్రాయంగా తెలిసిందని, అది కూడా పూర్తిగా నివృత్తి కావాలని చెప్పారు.

# రాబోయే పదిన్నరేళ్ల పాటు నేనే సిఎం

మొదటి తరువాయి

కేంద్రబడ్జెట్ లో తెలంగాణకు బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు వచ్చిందని, హైదరాబాద్ నగరాన్ని బుల్లెట్ ట్రైన్ హబ్ గా మారుస్తామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఆ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనలను కేంద్రమంత్రికి ఇచ్చామన్నారు. ఫ్యూచర్ సిటీ, ఎయిర్?పోర్టునకు సమీపంలో 500-700 ఎకరాలు ఇవ్వాలనుకుంటున్నామని వెల్లడించారు. అమీర్‌పేటలో ఎన్టీఆర్ విగ్రహం పెట్టితీరుతామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నందమూరి తారకరామారావుకు భారతరత్న ఇవ్వాలని ప్రతిపాదిస్తానని తెలిపారు. 2018లో తెచ్చిన నిబంధనల ప్రకారమే సింగరేణిలో టెండర్లు జరిగాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సింగరేణి టెండర్లపై ప్రతి డాక్యుమెంట్‌ను అసెంబ్లీలో పెడతానన్నారు. ఆరోపణలు తప్పని తేలితే కిషన్‌రెడ్డి క్షమాపణలు చెబుతారా అని రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. సింగరేణి సంస్థ అప్పులు తమ హయాంలో పెరగలేదన్నారు. కేసీఆర్? పెట్టిన బకాయిలే ఎక్కువగా ఉన్నాయని వివరించారు. సింగరేణి విషయంలో కేసీఆర్ ను కిషన్ రెడ్డి ఎందుకు ప్రశ్నించలేదన్నారు. మొత్తగా ఉన్నానని తనను మాత్రమే ఆయన ప్రశ్నిస్తున్నారని పేర్కొన్నారు."2029 ఏప్రిల్‌లో జమిలి ఎన్నికలు జరుగుతాయి. జమిలి ఎన్నికల్లోనే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ఉంటాయి. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు వచ్చింది. బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు ప్రతిపాదనలు కేంద్రమంత్రికి ఇచ్చాము.



ఫ్యూచర్‌సిటీ, ఎయిర్‌పోర్టు సమీపంలో 500-700 ఎకరాలు ఇవ్వాలనుకుంటున్నామని తెలిపారు. తన ప్రభుత్వంలో నూటికి నూరుశాతం ఫోన్ ట్యాపింగ్ లేదని రేవంత్ రెడ్డి అన్నారు. తాను ప్రజల అభిప్రాయాన్ని మాత్రమే తెలుసుకుంటానని ఆయన తెలిపారు. నాలుగు గోడల మధ్య జరిగే వ్యవహారం తనకు అవసరం లేదని వివరించారు. ఎస్ఐబీ ఫిర్యాదుతోనే కేసు దర్యాప్తు జరుగుతోందని వివరించారు. ఎస్ఐబీలో పరికరాల మాయంతోనే కేసు బయటపడిందన్నారు. కిషన్‌రెడ్డి లేఖ రాస్తే ఫోన్ ట్యాపింగ్ కేసు కూడా సీబీఐకి ఇస్తామని రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ కు రాజకీయ ప్రత్యర్థులే తప్ప శత్రువులు లేరని రేవంత్ రెడ్డి చెప్పారు. కాళేశ్వరంపై సీబీఐ దర్యాప్తు కోరుతూ లేఖరాసి 6 నెలవుతుందని, కేంద్రం ఇంతవరకు ఎందుకు నిర్ణయం తీసుకోలేదని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. విద్యుత్ కొనుగోలు వ్యవహారం కేసును త్వరలోనే సీబీఐకి ఇస్తామని ఆయన వెల్లడించారు. రాబోయే పదిన్నరేళ్ల పాటు తానే ముఖ్యమంత్రిగా కొనసాగుతానని, తనకు రాష్ట్రంలో ఎవరూ పోటీ లేరని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలోనే కాకుండా, ప్రతిపక్షాల్లో కూడా తనకు పోటీ ఇచ్చే నాయకుడు లేడని స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. బీఆర్ఎస్ నేతల విమర్శలపై స్పందిస్తూ, తనను విమర్శించిన వారికే తాను సమాధానం ఇస్తున్నానని, ఎవరిపైనా వ్యక్తిగత కక్ష సాధించడం లేదని అన్నారు. "కేసీఆర్‌ను జైల్లో పెట్టాలనుకుంటే ఎప్పుడో పెట్టేవాడిని. కానీ, ఆయన ఫామ్‌హౌస్‌కే పరిమితమై స్వీయ శిక్ష విధించుకున్నారు. అలాంటి వ్యక్తిని జైల్లో వేయాల్సిన అవసరం నాకు లేదు" అని రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫార్మా సిటీ కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలు ఉన్నప్పటికీ కేటీఆర్‌ను ఈడీ ఎందుకు విచారించడం లేదని ఆయన ప్రశ్నించారు.సింగరేణి బొగ్గు గనుల కేటాయింపు వివాదంపై రాబోయే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో పూర్తి వివరాలతో చర్చిస్తామని సీఎం తెలిపారు. కేంద్ర బొగ్గు శాఖ మంత్రిగా కిషన్ రెడ్డి ఈ వ్యవహారంలో వాస్తవాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఇక కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై సీబీఐ విచారణ కోరుతూ కేంద్రానికి లేఖ రాసినా ఇప్పటివరకు ఎలాంటి స్పందన రాలేదని అన్నారు.

# ఉత్తర కొరియా వారసురాలిగా కిమ్ జు యే..

- **కూతురును ఎంపిక చేసిన కిమ్ జోంగ్ ఉన్**
- **మూడు తరాలుగా కిమ్ కుటుంబం చేతిలోనే ఉత్తర కొరియా నాయకత్వం**
- **దీంతో ఇకపై కూడా నాలుగో తరానికి నాయకత్వ బాధ్యతలు అప్పగించాలని కిమ్ భావిస్తున్నారు.**
- **కిమ్ కూతురు వయసు 13 ఏళ్లు.**

**న్యూఢిల్లీ**

ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ వారసురాలిగా ఆయన కూతురు కిమ్ జు యే ను ఎంపిక చేసినట్లు దక్షిణ కొరియా వెల్లడించింది. ఈ విషయాన్ని కిమ్ ఇంకా అధికారికంగా ప్రకటించకపోయినా, కిమ్ తన కుమార్తెనే దేశాధినేతగా నిర్ణయించారని దక్షిణ కొరియాకు చెందిన నిఘా సంస్థ 'నేషనల్ ఇంటెలిజెన్స్ సర్వీస్' ప్రకటించింది. ఈ అంశాన్ని దక్షిణ కొరియా తన దేశంలోని చట్టసభల నేతలకు తెలిపింది.ఉత్తర



కొరియాలో ప్రతి ఐదేళ్లకోసారి నిర్వహించే కాంగ్రెస్ సమావేశం ఈ నెల చివరిలో జరగనుంది. ఈ నేపథ్యంలో దేశానికి కొత్త నాయకత్వం ఎవరూ అనే అంశంపై చర్చ జరుగుతుండగా.. అనేక పేర్లను పరిశీలించిన కిమ్ తన కూతురును భవిష్యత్ నాయకురాలిగా ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆమెకు ఈ అంశంపై తగిన శిక్షణ, అవగాహన కల్పిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికి మూడు తరాలుగా కిమ్ కుటుంబం చేతిలోనే ఉత్తర కొరియా నాయకత్వం కొనసాగుతోంది. దీంతో ఇకపై కూడా నాలుగో తరానికి నాయకత్వ బాధ్యతలు అప్పగించాలని కిమ్ భావిస్తున్నారు. దీనిలో భాంగా తన కూతురు కిమ్ జు యేను ఎంపిక చేశారు. అధికారిక సమాచారం లేనప్పటికీ కిమ్ కూతురు వయసు 13 ఏళ్లు. ఆమె 2013లో పుట్టింది. నవంబర్ 2022లో ఉత్తర కొరియా జరిపిన క్షిపణి పరీక్షకు కిమ్ జు యే హాజరైంది.ఆ తర్వాత కూడా కొన్ని సందర్భాల్లో తండ్రితోపాటు కనిపించింది. 2025లో బీజింగ్‌లో పర్యటించింది. గత జనవరిలో ఆమె కుముసన్ సహా కీలక ప్రాంతాల్ని సందర్శించింది. అంటే ఆమెను వారసురాలిగా సిద్ధం చేస్తున్నట్లుందని దక్షిణ కొరియా భావిస్తోంది. ఇప్పటికే ఆమె పాలనాపరమైన అంశాల్లో అధికారులకు కొన్ని కీలక సూచనలు చేస్తున్నట్లు సమాచారం.

# డిండి లో సమ్మె విజయవంతం

**కార్మికులను బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్లు రద్దుకై- ఏఐటియుసి ,సిపిఐ..**




**దేవరకొండ ఫిబ్రవరి 12 (నీలగిరి ఎక్స్ ప్రెస్).** కామికులను బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్లు రద్దుకై నల్లగొండ జిల్లా డిండి మండలం కేంద్రంలో ఫిబ్రవరి 12 సమ్మె దేశవ్యాప్తంగా నరేంద్ర మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న సమ్మె చంప మీద కొట్టినట్టుగా జరిగిందని జిల్లా రైతు సంఘం అధ్యక్షులు కామ్రేడ్ మైనుద్దీన్ అన్నారు . కార్మికులనుపెట్టుబడిదారులకు కట్టు బానిసలుగా మార్చే విధంగా నరేంద్ర మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం తీసుకు వచ్చిన నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఏఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్లుగా గురించి కార్మికులపై నిమ్మకు నీరు ఎత్తినట్టు వ్యవహరిస్తున్నారు. కార్మిక ప్రజా రైతు వ్యతిరేక విధానాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లను ఎత్తివేయాలని కార్మికులపై మోపుతున్న పెనుబారాన్ని తగ్గించకపోతే నరేంద్ర మోడీ గద్దె దిగవలసిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. సిపిఐ మండల కార్యదర్శి శ్రీరామదాసు కనకాచారి మాట్లాడుతూ ,కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం నిత్యం పోరాటాలలో భారత కమ్యూనిస్టు పార్టీ ముందు వరుసలో నిలబడుతుందనిపార్టీ భరోసా కల్పిస్తుందని అన్నారు. గడచిన శతాబ్ద కాలంలో ఏఐటీయుసీ నాయకత్వంలో భారత కార్మిక వర్గం అనేక పోరాటాలు త్యాగాలు చేసి 2014లో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటిస నుండి కార్మికుల సంఘ హక్కు, సమ్మె హక్కులను కాల రాస్తున్నారని విమర్శించారు. స్వతంత్రం వచ్చినప్పటినుండి కార్మికుల ప్రజల త్యాగాలతో నిర్మించుకున్న ప్రభుత్వ రంగ సంస్థలను , దేశ సంపదను అదాని ,అంబానీ లాంటి కార్పొరేట్ పెట్టుబడిదారులకు కారుచౌకగా దోచిబెడుతున్నారు. దేశం అప్పు 58 లక్షల కోట్ల నుండి 214 లక్షలకు పెరిగిందని,పేద ప్రజలపై భారం మోపి లక్షల కోట్ల రూపాయలు సంపన్నులకు రాయితీలు ఇస్తున్నారు. పర్మనెంట్ విధానం రద్దుచేసి కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ విధానంతో ఉద్యోగులను కార్మికులను నిలువు దోపిడీ చేస్తున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా ఉన్న ఎల్ఐసి, బ్యాంకులు తదితర రంగాలను ప్రైవేటుకు దారాదత్తం చేస్తున్నారు. ప్రభుత్వ రంగాన్ని కాపాడాలని, , అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టం అమలు చేయాలని, అంగన్వాడి, మధ్యాహ్న భోజన, ఆశా భవన నిర్మాణ రంగం, స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం రు 26,000 అమలు చేయాలని, కనీస పెన్షన్ నెలకు 9000 రూపాయలు ఇవ్వాలని, రద్దుచేసి కార్మిక న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటియూ సి మండల అధ్యక్షులు భు ష్పక లింగమయ్య ,ఏఐటియుసి డివిజన్ నాయకులు కంపల్లి ప్రేమయ్య,ఏఐవైఫ్ జిల్లా నాయకులు యనమల నవీన్,గ్రామపంచాయతీ కార్మిక సంఘం మండల అధ్యక్షులు రామావత్ జోహార్ లాలు, భవానిర్మాణ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎలిమినేటి దేవయ్య ,మండల ఉపాధ్యక్షులు వేముల ప్రవీణ్, నాగిళ్ల సహదేవ్ ,గంగమ్మ ,లక్ష్మమ్మ ,సాలమ్మ ,లాబాను ,దావీద్ ,పంత్య, వెంకటయ్య , మద్దెల పర్వతాలు, కడారి తిరుపతయ్య, మధ్యల లింగమ్మ,నాగార్జున, జగతయ్య, జంగయ్య , పారమేష్, భారతి,సుజాత,దిరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుడికి బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ



**దమ్మాయిగూడ, ఫిబ్రవరి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరుగు శివకృష్ణ ఆధ్వర్యంలో గురువారం దమ్మాయిగూడలో నివసించే నిరుపేద దివ్యాంగుడికి బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. వెంకటేష్ బట్టల దుకాణంలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్న ఈ యువకుడి కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో సమాజ సేవకురాలు కే. భానుప్రియ రెడ్డి వెంటనే స్పందించి 25 కేజీల బియ్యం, ఇతర అవసరమైన సరుకులను అందజేశారు.ఈ సందర్భంగా భానుప్రియ రెడ్డి మాట్లాడుతూ, “సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన దివ్యాంగులకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత. గత కొన్ని సంవత్సరాలుగా నిరుపేదలు, వృద్ధులు, దివ్యాంగులు, ఆపదలో ఉన్న కుటుంబాలను గుర్తించి సహాయం చేస్తున్నాను. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తాను” అని తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు గుత్తికొండ కిరణ్, సాయి రెడ్డి తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు ఈ సేవా కార్యక్రమాన్ని అభినందిస్తూ, భానుప్రియ రెడ్డి చేసిన సహాయాన్ని ప్రశంసించారు.

# సైన్స్ ఫెయిర్ లు విజ్ఞాన భండాగారాలు

**- జిల్లా గవర్నర్ డా. జి. మహేంద్ర కుమార్ రెడ్డి**



**తలకొండపల్లి, ఫిబ్రవరి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తలకొండపల్లి అక్షర హైస్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌కు ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా గవర్నర్ డా. జి. మహేంద్ర కుమార్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థి దశలో శాస్త్రీయ అవగాహన పెంపొందించడంలో ఈ విజ్ఞాన ప్రదర్శనలు ఎంతో దోహదం చేస్తాయని పేర్కొన్నారు. ఆధునిక కాలంలో ఎన్నో శాస్త్రీయ ప్రగతులు జరిగినప్పటికీ, ఇంకా కొన్ని మూఢనమ్మకాలు సమాజంలో కొనసాగుతున్నాయని, వాటిని తొలగించగలిగేది ఇలాంటి సైన్స్ ఫెయిర్‌లేనని ఆయన స్పష్టం చేశారు.వీటి ద్వారా హేతుబద్ధత పెరిగి పిల్లల్లో ప్రశ్నించే తత్వం పెంపొందుతుందని, వరుసగా పదోసారి సైన్స్ ఫెయిర్ నిర్వహిస్తున్న అక్షర పాఠశాల యాజమాన్యాన్ని ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో ఆమనగల్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి, పీడీజీ చెన్నకిషన్ రెడ్డి, క్యాబినెట్ కార్యదర్శి తాళ్ల అంజయ్య, ట్రెజరర్ బి.ఆర్. రాంరెడ్డి, జోన్ చైర్మన్ జూలూరి లింగయ్య, పి.ఆర్.కె. నాగరాజు, పి.ఎస్.ఎన్. రాజు, గంప శ్రీను, కండె ఓంకారం, జూలూరి రమేష్, జి. శ్రీనివాస్ రెడ్డి, చేగూరి వెంకటేష్, జల్కం రమేష్, పిప్పళ్ల వెంకటేష్, గూడ రాజు, రావుల కుమార్ గౌడ్, జహంగీర్ అలీ, ఆప్టోమెట్రిస్ట్ రాజేందర్, క్లబ్ పి.ఆర్.ఓ పాషా, ట్రస్మా ఉపాధ్యాయులు శ్రీనివాస్ గౌడ్, గోలి శ్రీనివాస్, రమేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక సంఘాల భారీ ర్యాలీ







**ఆమనగల్లు, ఫిబ్రవరి 12(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** ఆమనగల్లు మండల కేంద్రంలో దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల పిలుపు మేరకు గురువారం నాడు సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో హమాలీ సంఘం, భవన నిర్మాణ కార్మిక సంఘం, ఆశా వర్కర్ల సంఘం, మధ్యాహ్న భోజన సంఘం, గ్రామపంచాయతీ వర్కర్స్ సంఘం, కెవిపిఎస్ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన భారీ ర్యాలీ బాపూజీ భవన నిర్మాణ కార్యాలయం నుండి, తహాసీల్దార్ కార్యాలయం నుండి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. సమ్మెలో రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు జహంగీర్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా కార్మికుల సమ్మె నాలుగు లేబర్ కోడ్ లను వ్యతిరేకిస్తూ కార్మికులు ఇచ్చిన సమ్మెలో కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా చట్టాలు తెచ్చి కార్మికుల వ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దె దించాలని, పేదల ప్రభుత్వం కాదు, కార్పొరేట్ కంపెనీల ప్రభుత్వమని ఖనిజ సంపద దోచిపెడుతున్న ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం పని గంటలు పెంచిన ప్రభుత్వమని 8 గంటల పని దినం పోరాడి సాధించుకున్న విద్యుత్తు సవరణ బిల్లును వ్యతిరేకించాలని మరియు 12 గంటల పని విధానాన్ని తెస్తున్న కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక ప్రభుత్వాన్ని అన్ని పార్టీలు వ్యతిరేకించాలని, విద్యుత్ సవరణ బిల్లును వ్యతిరేకించాలని, కోటిమంది సంఘటిత కార్మికులకు కనీస వేతనం 26,000 ఇవ్వాలని ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, కార్మిక రక్షణ చట్టం తేవాలని, ఈ సందర్భంగా మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి నాగిల్ల యాదయ్య, గౌరవ అధ్యక్షులు గంగిశెట్టి సురేందర్, ముఖ్య సలహాదారు ముక్కెరి కృష్ణయ్య, కార్మికులు మల్లేష్ ,వెంకటయ్య, పర్వతాలు, సీతారాం, రత్నం ,రవి ,ఎల్లయ్య, నరసింహ, మస్తాన్ ,సయ్యద్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఏలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వకుండా మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపును పారదర్శకంగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి. చంద్రశేఖర్**



**నల్లగొండ ఫిబ్రవరి 12 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** గురువారం సాయంత్రం అయన ఆర్జాలబావి స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదాంలో ఏర్పాటు చేసిన నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని మున్సిపల్ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు జి. రమేష్ తో కలిసి కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆర్ ఓ,ఏ ఆర్ ఓ, కౌంటింగ్ సూపర్వైజర్లతో సమావేశం నిర్వహించారు. కౌంటింగ్ రోజున సిబ్బంది అందరూ ఉదయం 6 గంటలకు కౌంటింగ్ కేంద్రంలో రిపోర్ట్ చేయాలని, కౌంటింగ్ కేంద్రంలోకి ఆర్వో ,హాల్ ఇంచార్జ్ తప్ప ఎవరి మొబైల్ ఫోన్ అనుమతి ఉండదని తెలిపారు. కౌంటింగ్ సిబ్బంది బ్యాలెట్ బాక్స్ సీరియల్ నెంబర్ సరిగా ఉన్నది లేనిది పరిశీలించాలని, అలాగే స్టాచుటరి మెటీరియల్, పీజియన్ బాక్స్ ,ఓట్ల లెక్కింపు తర్వాత బండిల్స్ వేసేందుకు డ్రమ్ములు వంటి అన్ని ఏర్పాట్లు చూసుకోవాలని తెలిపారు. 13న ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు చేపట్టడం జరుగుతుందని ,అనంతరం రెగ్యులర్ ఓట్లలెక్కింపు ఉంటుందని ,కౌంటింగ్ టేబుల్ వద్ద సిబ్బంది అందరూ అలాగే ఆర్ ఓ. లతో సహా నిశ్శబ్దాన్ని పాటించాల్సిన అవసరం ఉందని, 25 బండిళ్ల చొప్పున కట్టలు కట్టిన తర్వాత ఓట్ల లెక్కింపు చేపడతారన్నారు. ఓట్ల లెక్కింపును పూర్తిగా ఎలాంటి తప్పులకు ఆస్కారం ఇవ్వకుండా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలని, ముఖ్యంగా చెల్లిన, చెల్లని ఓట్ల విషయంలో ఒకటికి రెండుసార్లు చూసుకొని బాక్స్ లో వేయాలని, రాష్ట్ర ఎన్నికల సంఘం జారీచేసిన సర్కులర్లు అన్నింటిని మరొకసారి చదువుకోవాలని, మొత్తం ఓట్ల లెక్కింపు చేసేటప్పుడు ఎలాంటి తప్పులు జరగకుండా చూడాలని, రీకౌంటింగ్ కు ఆస్కారం లేకుండా ఓట్ల లెక్కింపు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. సాధారణ పరిశీలకులు జీ. రమేష్ ,రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ అశోక్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పీడి రాజ్ కుమార్, డిసిఓ పత్యా నాయక్,జెడ్ పి సి ఈ ఓ శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుల ఆధ్వర్యంలో సిబ్బంది రాండమెంజేషన్ ను నిర్వహించారు

# దేశవ్యాప్త కార్మిక సమ్మె విజయవంతం




**ఎలిగేడు, ఫిబ్రవరి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భారతదేశవ్యాప్తంగా గురువారం నిర్వహించిన కార్మిక సమ్మె విజయవంతమైందని కెవిపిఎస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ నవీన్ తెలిపారు. మండల కేంద్రంలోని తహసిల్దార్ యాకన్నకు కార్మిక సంఘ నాయకులు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ, “దేశవ్యాప్తంగా అమల్లో ఉన్న కార్మిక చట్టాలను రద్దు చేసి, కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను ఉపసంహరించుకోవాలి” అని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఇరుగురాల లచ్చయ్య, మండల జీపీ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ తిట్ల శ్రీనివాస్, కార్మిక సంఘ సభ్యులు దేవేందర్, రమేష్, లక్ష్మణ్, కొండయ్య, రవీందర్, చంద్రయ్యతో పాటు అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, హమాలీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.సమ్మె సందర్భంగా కార్మికులు, ప్రజా సంఘాలు ఏకతాటిపైకి వచ్చి నినాదాలతో పట్టణం మార్మోగించారు.

# మానసిక ఆరోగ్యం మానవాభివృద్ధికి పునాది





దేశాభివృద్ధికి 'సౌభాగ్యానికి 'ప్రజారోగ్యం ముఖ్యమైనది.ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం ఆరోగ్యంఅంటేశారీరక మానసిక 'సాంఘిక ఆధ్యాత్మిక 'కుశలత అంతే కానీ కేవలం ఒక వ్యాధి గాని వైకల్యం కాని లేక పోవడం మాత్రమే కాదని పేర్కోవడం గమనార్హం.మానసికఆరోగ్యం ఆర్థిక వ్యవస్థలో ఉత్పాదక శక్తిని ఉత్పత్తినిపెంచుతుంది. మానసికఆరోగ్యంమానవాభివృద్ధి కి శ్రేయస్సుకు పునాదలాంటిది.మానవ జాతిలో శ్రామిక సామర్థ్యం ఇనుమడించిసమర్థవంతంగా పనిచేయడానికి దోహద పడుతుంది.

"ఆరోగ్య మే మహాభాగ్యం అనేది" సమాజం యొక్క జీవన విధానం కావాలి. ఆరోగ్యం బాగుంటెనే అంతా బాగుంటుంది. నేటి ఉరుకుల పరుగుల జీవన విధానంలో మానసిక ఆరోగ్యమే మహాభాగ్యం అంటున్నారు మానసిక వైద్య నిపుణులు. నాటి కాలాన్ని బట్టి పెద్దలు ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు. కాని ఇప్పటి పరిస్థితులు ఆస్తులు భౌతిక సంపదకై పెంపర్లాడే సంస్కృతి నెలకొంది . "హైటెక్ యుగంలో మానవ జీవితం పరుగులమయమై పోటీ పోలికల వాతావరణం నెలకొన్నది. ఉదయం మేల్కొనప్పటి నుండి రాత్రి పడుకునే వరకు ఒకటే టెన్షన్ టెన్షన్ . బిజీ జీవితం కనీసం కుటుంబ సభ్యులతో సైతం గడుపలేని దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి. నేడు ఔత్సాహిక యువ తరంలో శారీరకసమస్యలతో పాటు మానసిక సమస్యల్లో వున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. కొందరు మానసిక సమస్యలు బయటకు చెప్పుకోలేక లోలోపలసతమతమౌతున్నారని ఆరోగ్య సర్వేలు వెల్లడిస్తున్నాయి.

మారిన సామాజిక' ఆర్థిక సాంస్కృతిక 'సాంకేతిక మార్పుల వల్ల మానవులు ఒడిదొడుకులకు గురౌతున్నారు.కాలానికిఅనుగుణంగా అన్నివిషయాలలో మానవుడు వేగాన్ని పెంచాడు. అన్నిరంగాలలో సంపూర్ణ "పోలికత్వం " "పోటీతత్వం" పెరిగి పోయి భౌతిక సంపదపై మోజు పెరిగింది. అందరికంటె ఎక్కువ ఆర్థిక సంపద కలిగివుండాలన్న వాణిజ్య వాదంరాజ్యమేలుతుంది.భౌతిక సంపదపట్ల కాంక్ష పెరిగి బౌద్ధిక తాత్వికత తరిగి నైతికతక విలువలు క్షీణించి మానసిక ఆందోళన ఒత్తిడి మనిషి పాలిటి శాపంగా పరిణమించింది. ఈనేపథ్యంలో మానసిక ఆరోగ్యం ప్రాముఖ్యతను సంతరించుకుంది . జీవిత లక్ష్యాలను సాధించడానికి ఆనందంగా జీవించేందుకు శారీరక దారుఢ్యం తో పాటు మానసిక ఆరోగ్యం బాగుండేలాచూసుకోవాలి.ఇందుకు కావలసిన అవగాహన చైతన్యం ప్రజల్లో కలిగించి అప్రమత్తంగా ఉండేందుకు కార్యాచరణ ప్రణాళికలను రుపొందించుకుని తగిన జాగ్రత్తలు పాటించాలి. మానసిక ఆరోగ్యాన్ని అశ్రద్ధ చెసినచో చికిత్సను మద్యలో ఆపి వేసిన అదుపు తప్పే ప్రమాదం వుంది. దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు మానసిక ఆరోగ్యం పై తీవ్ర ప్రభావం చూపిస్తాయి.మానసిక ఆరోగ్యం శారీరక ఆరోగ్యాన్ని తీవ్రంగాదెబ్బతీస్తుంది.మానవుడు శారీరక మానసిక ధారుఢ్యత పట్ల అప్రమత్తంగా ఉండేందుకు అవసరమైన ఆరోగ్య సూత్రాల పట్ల అవగాహన కలిగి ఉండాలి. మానసిక రోగం సమస్యలు చెబితే చాలా మంది బయంతో వణికి పోతారు.మానసిక జబ్బుగురించిచర్చించడానికి చెప్పుకోవడానికిసంకొచిస్తారుతమలో తాము మదన పడి వ్యాధి తీవ్రతను పెంచుకునే ధొరిణి పెరిగిందని ఆరోగ్య సర్వేలు చెబుతున్నాయి.

2020 నాటికి ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం 45 కోట్ల మంది ప్రజలు మానసిక దుర్బలత్వంతో 'వైకల్యంతో బాధపడుతున్నారు. భవిష్యత్తులో ఈ సమస్య తీవ్రమయ్యే సూచన లున్నాయని వైద్య 'ఆరోగ్య అద్యయనాలువెల్లడించాయిమానసిక ఒత్తిడి అనేది రెండవ అతిపెద్ద తీవ్రమైన వ్యాధిగా మారి ప్రజల మీద ఆర్థిక భారాన్ని మోపుతోంది.( ముర్రే అండ్ లోపెజ్) 1996 లో జరిపిన అధ్యయనం ప్రకారం అభివృధి చెందిన' అభివృధి చెందుతున్న దేశాలలో ఒత్తిడి పెరిగి మానసిక సమస్యలు తీవ్రమై మానసిక వ్యాధుల.వైద్య ఖర్చులు మోయలేని ఆర్థిక భారాన్ని కలిగిస్తుందని తన పరిశోధనలో చెప్పాడు. మానసిక వైద్య నిపుణుల అంచనా ప్రకారం 40 శాతం మంది పిచ్చి వాళ్లే ఉన్నారని వైద్యారోగ్య సర్వేలు వెల్లడిస్తున్నాయి. వాస్తవానికి సమాజములో 2.శాతం మంది మాత్రమేమానసికంగా ఫిట్ గా ఉన్నట్లు అంచనాలు తెలుపుతున్నాయి.మానసిక వైకల్యం వచ్చిన వారిలో సగానికి పైగా 14 ఏళ్ల లోపు వయసువారు ఉన్నారని ఈ వయసు నుంచి ఈ సమస్య ప్రారంభమౌతుందనీ ఆరోగ్య సర్వేలువెల్లడిస్తున్నాయి. .మొత్తం 20 శాతం మంది బాల బాలికల్లోఈఅవలక్షణం ఉన్నట్లు తేలింది.బాల్య దశలో కుటుంబాలలో జరిగిన హింస 'నిర్లక్ష్యం భయంకర సంఘటనలు సామాజిక పరిస్థితుల కారణంగా మానసిక వైకల్యం చెందడం సర్వ సాధారణ కారణంగా మానసిక వైద్యులు చెబుతున్నారు. మన సమాజంలో వింత ప్రవర్తనలు వింత పోకడలు ఉన్న వ్యక్తులు కనిపి స్తుంటారు. ఒకరికి డబ్బు పిచ్చి' ఒకరికి తిండి పిచ్చి ' నగల పిచ్చి' ఆస్తుల సంపాదన పిచ్చి' సినిమాలు విపరీతంగా చూడడం' నటన పిచ్చి 'గొప్పలు చెప్పుకునే పిచ్చి' ఆడంబరాలకు పోయేపిచ్చి' వివిధ రకాల మానసిక రుగ్మతలు వున్న వారు మన చుట్టూ కనిపిస్తుంటారు. ఇతరులను అకారణంగా భాదించే షాడిస్ట్ వైఖరి వున్న వ్యక్తులు వుంటారని ఏదైనా

అవధులు దాటిన అలవాటు లక్షణంపిచ్చికిందపరిగణిస్తారు.

**మానసిక వైపల్యాలు**

వైద్య పరిభాషలో మానసిక వైపల్యాలు అనేక రకాలు గా పేర్కొంటారు. డిప్రెషన్ 'యంగ్సిటి "యాంగ్సిటి నురోసిస్ 'బైపోలార్ డిజార్డర్ సోషల్ 'యంగ్సిటీ డిజార్డర్

పానిక్ డిజార్డర్ 'అబ్సెసివ్ కంపల్సివ్ డిజార్డర్ 'పోస్ట్ ట్రామా టెక్ డిజార్డర్' ఫోబియా 'మానియా స్క్రిజోఫెనియ' డిల్లుషన్ డిజార్డర్ స్లీప్ డిజార్డర్ ' ఇన్ఫరియారిటీ కాంప్లెక్స్'సుపిరియారిటీ కాంప్లెక్స్ అడ్డిక్షన్ 'ఇల్లుషన్ 'లాంటి మానసిక వైకల్యాలు వుంటాయి. మానసిక ఉద్రిక్తతలను తగ్గించుకోక పోవడం వల్ల నిగ్రహశక్తి కోల్పోవడం వల్ల మానసిక రుగ్మతలుపెరుగుతున్నాయి కష్ట కాలంలో (సమయంలో) క్లిష్ట పరిస్థితుల్లో ఒత్తిడి కి లోనుకాకుండా కుంగి పోకుండా మనోధైర్యం తో ఆలోచనలు చేస్తే మెదడు సక్రమంగా పనిచేస్తుందని వైద్యులు సలహా మానసిక ఒత్తిడి విషవలయంలో పడకుండా ఓరుపు 'సహనం 'ప్రశాంతతనిగ్రహం.అలవరుచుకోవాలి.

**మానసిక ప్రశాంతత జీవన శైలి**

మానసిక ప్రశాంతత జీవన శైలిపై ఆదారపడి ఉంటుంది. రోజు వ్యాయామము మెడిటేషన్ 'సోషల్ ఇంటరాక్షన్ పౌష్ఠిక ఆహారం 'రిలాక్సేషన్ ఎక్సర్సైజ్ 'చేయాలి మనసుకు హాయి నిచ్చే సంగీతం వినడం .భజన ఆధ్యాత్మిక కార్యక్రమాలలో భాగస్వామ్యం కావడం. పెద్ద., సమస్యలు వచ్చినప్పుడు ఆందోళనకు గురికాకుండా కుంగి పోకుండా ఉద్రిక్తతలకు లోనుకాకండ మనసును దృఢంగా వుంచుకోవాలి.ప్రతి సమస్యకు పరిష్కారం వుందన్న విషయాన్ని బలంగా నమ్మాలి. మన పట్ల మనకు నమ్మకం వుండాలి. సహసంతో సమస్య పరిష్కార మార్గాలను అనుసరించాలి.ఇలా చేస్తే మానసిక రుగ్మతలు అనారోగ్య సమస్యలు మన దరి చేరవు.అని మానసిక వైద్యులు చెబుతున్నారు. క్లిష్టతరమైన సమస్యలు వస్తే తల మునకలు కాకుండా తోటి వారితో షేర్ చేసుకొని వారి సహాయం సలహా తీసుకుంటే ఆందోళన ఒత్తిడి తగ్గుతుంది. అందని వాటికి అర్రులు చాచడం నెరవేరని సాధ్యం కాని పనుల గురించి ఆలోచించడం మానుకోవాలి.ఆందోళన చెందకుండ మనసును దృఢంగా వుంచుకోవాలి.

**వృద్ధుల్లో మానసిక కుంగు బాటు ఎక్కువ**

ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం కావడం నవ నాగరికత విదేశీ సంస్కృతి 'విదేశీ చదువులు' విదేశీ కొలువల పై పెరిగిన క్రేజీ వల్ల వృద్ధా ప్యంలో వుండే ఒంటరి తల్లి తండ్రుల సంఖ్య రోజురోజుకు పెరిగి పోయింది. ఆత్మీయత కరువై ఆంథొళన ఒత్తిడి వారికి శాపంగా పరిణమించింది ఈ స్థితి .వల్ల చాలా మంది వృద్ధులుమానసికవ్యాధులతో ఆసుపత్రుల్లో చేరేవారి సంఖ్య గణనీయంగా పెరిగిందని ఆరోగ్య సర్వేలో తేలిన నిజం. వృద్ధులతో పాటు మధ్య వయసు వారిలో కూడా మానసిక వ్యాధులువస్తున్నాయి.మానసిక చికిత్స కేంద్రాలకు వచ్చే వారిలో వృద్ధులు 25 శాతం మంది ఉన్నారని సర్వేలో తేలింది. వృద్ధులు ఎక్కువగా డిప్రెషన్ 'నిద్రలేమి 'ఆందోళన కుంగుబాటు' డిమెన్షయాలాంటి మానసిక రుగ్మతలతో ఆసుపత్రులకు వస్తున్నారు.వృద్ధా ప్యంలో మానసిక అనారోగ్యం కలుగకుండా జాగ్రత్తలు పాటించాలి. కుటుంబ సభ్యులు వృద్ధుల పట్ల ప్రేమ ఆదరణచూపించాలి . సకాలములో వైద్య ఆరోగ్య సలహాలు తీసుకొని చికిత్స చేయించుకోవాలి.

మానసిక సమస్యలు ఏర్పడితే వయసుతో సంబంధం లేకుండా సైక్రటిస్ట్( మానసిక వైద్యుని) వద్ద చికిత్స తీసుకోవాలి. వాయిదా వేయడం మానుకోవాలి. సమాజం వేగంగాపరుగెడుతుంది.ఉరుకుల పరుగు ల జీవితం లో ఓర్పు' సహనం సమన్వయం 'అలవాటు చేసుకోవాలి. అల్ప కాలములో అత్యధిక ధనికులు కావాలని ప్రపంచాన్ని జయించాలని జీవితములో నిరంతరం పరుగులు పెడుతున్నారు. ఈ వేగములో పడి కుటుంబ సభ్యులను పట్టించుకోవడం లేదు.ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. బంధాలను అనుబంధాలను మరిచి పోతున్నారు."జీవితములో వేగం ఉండాలి కాని వేగమే జీవితం కాకూడదు".కష్టాల్లో బాధల్లో మన వాళ్ళు ఆత్మీయులు తోడుంటే ఆ ధైర్యమే వేరుగా ఉంటుంది. డబ్బులు పోతే మళ్ళీ సంపాదించవచ్చు .బంధాలు అనుబంధాలు తెంచుకుంటే తిరిగి రావు.వ్యసనాలకు స్వస్తి చెప్పి నవ్వుతూ నవ్విస్తూ జీవిస్తే ప్రశాంతత చేకూరి మానసిక సమస్యలు రావు.కష్టాలు సమస్యలు బాధలు మన జీవితములో అంతర్భాగాలు అవి వుంటూనే ఉంటాయి. వాటితో సహజీవనం చెయ్యల్సిందే .వాటికి భయపడకుండా మనోధైర్యం తో ఎదురుకోవాలి. చింతన మానుకొని ప్రశాంతతను పెంచుకొని శాంతియుత జీవనం కొనసాగిస్తే మానసిక ఆరోగ్యం మన సొంతమవుతుంది. మన ఆరోగ్యం మన చేతుల్లోనే వుంది .మానసిక ఆరోగ్యమే మహాభాగ్యము అనేది మన జీవన శైలి కావాలి.

ప్రభుత్వాలు బికృషి మానసిక ఆరోగ్య విధానాలు కేవలం మానసిక వైకల్యాలు పరిమితంకాకూడదు."మానసిక ఆరోగ్యమే" లక్ష్యంగా వైద్య ఆరోగ్య విధానాలు రూపొందించాలి.

ప్రపంచ ఆరోగ్య సంస్థ సభ్య దేశాల వైద్య ఆరోగ్య విధానాలను సమన్వయం చేసుకుంటూకాలానుగుణంగా వస్తున్న వైద్య విధానాల పట్ల అవగాహన చైతన్యం కలిగిస్తుంది. వివిధ ప్రభుత్వాలు అమలుచేస్తున్న వ్యూహాలను ప్రణాళికలను ఏకీకృతం చేస్తూ సంఘటిత పరుస్తోంది .మానసిక ఆరోగ్యం కోసం ప్రభుత్వ సమాజం సమిష్టి కృషి చెయ్యాలి.భవిష్యత్ మానవ వనరులైన పిల్లల మనో వికాసానికి చేయూతను ఇచ్చే కార్యాచరణకు పూనుకోవాలి.పిల్లల పెంపకం 'చైల్డ్ సైకాలజీ 'అంశాల మీద టీచర్స్ కు తల్లి తండ్రులకు అధ్యాపకులకు "శిక్షణ కేంద్రాలు"ఏర్పాటుచెయ్యాలి. మానసిక ఆరోగ్యం పట్ల యూనివర్సిటీలలో అద్యయనం పరిశోధనకు ప్రభుత్వం బడ్జెట్ కెటాయించాలి. పేదరికం "నిరుద్యోగం 'ఆర్థిక అసమానతలు 'ప్రాంతీయ అసమానతలు 'సామాజిక అంతరాలు స్త్రీ 'పురుష 'లింగ వివక్షత 'ఉమెన్ ట్రాఫికింగ్ ' బాలకార్మిక వ్యవస్థ 'వెట్టి చాకిరి మొన్నగు సామాజిక 'ఆర్థిక సమస్యలను పరిష్కరించి జీవన భద్రత 'భరోసాకు కావలసిన సామాజిక ,'ఆర్థిక రాజకీయ వాతావరణం ప్రభుత్వాలు కలిపించాలి. సాంఘికంగ.ఆర్థికంగా మహిళలకు సాధికారిత కలిపించాలి.వయోవృద్ధులకు సాంఘిక సహాయాలు అందించడం డే సెంటర్స్ "ఓల్డ్ ఏజ్ హోమ్స్" నేలకొల్పాలి. పాఠశాలలో మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించే పాఠ్యాంశాలు ప్రవేశ పెట్టాలి. మనో వికాసం మనోధైర్యం పెంచే కార్యక్రమాలలో విద్యార్థులను భాగ స్వాములను చెయ్యాలి.

పనిచేసే చోట మానసిక ఆరోగ్య సంరక్షణ కొరకు "కౌన్సిలింగ్ కేంద్రాలు" నెలకొల్పి సుశిక్షితులైన వైద్య ఆరోగ్య సిబ్బందిని ఏర్పాటు చెయ్యాలి . ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకం అద్వేర్యములో

మురికి వాడల్లో గ్రామీణ ప్రాంతాలలో ఉచిత మానసిక ఆరోగ్య శిబిరాలు ప్రభుత్వం నిర్వహించాలి. ప్రజలకు మౌలిక సదుపా యాలు గృహ వసతి 'విద్య' వైద్య 'రవాణా సౌకర్యాలు ఏర్పాటుచేసి వారిలో ఆత్మగౌరవాన్నిపెంపొందించాలి. సమాజములో ఉద్రిక్తతలు హింసాత్మక సంఘటనలు జరుగకుండ ప్రభుత్వం శాంతి భద్రతలు ' సంరక్షించే చర్యలు చేపట్టాలి. వ్యాయామము 'మెడిటేషన్ యోగఉదయం వాకింగ్ 'జాగింగ్ సైక్లింగ్ స్విమ్మింగ్' షటిల్ 'బ్యాడ్మింటన్ లాంటి క్రీడల్లో పాల్గొనాలి

పబ్లిక్ 'ప్రైవేట్ 'రంగాలలో పట్టణాలలో' గ్రామాలలో' పబ్లిక్ పార్కులను 'రిక్రియేషన్ సౌకర్యాలను ఏర్పాటు చెయ్యాలి.

ప్రభుత్వం 'స్థానిక సంస్థలు విద్య సంస్థలు 'మహిళా యువజన సంఘాలు 'సామాజిక సాంస్కృతిక స్వచంద సంస్థలు' పౌరసమాజం మానసిక ఆరోగ్య అక్షాస్యత పరి వ్యాప్తికి చిత్త శుద్ధి తో కృషి చేసిమానసిక ఆరోగ్యమే మహాభాగ్యము అన్నది నినాదం కాకుండా విధానంగా వర్ధిల్లాలి.

**నేదునూరి కనకయ్య**
**అధ్యక్షులు తెలంగాణ ఎకనామిక్ ఫోరం**
**సామాజిక.ఆర్థిక అధ్యయన వేదిక**
**9440245771 హైదరాబాద్**



# శాంతి భద్రతల కోసం సెక్షన్ 163 ఆదేశాలు

- కమిషనర్ జి. సుధీర్ బాబు



**ఫ్యూచర్ సిటీ, ఫిబ్రవరి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా శాంతి భద్రతలు కాపాడుటకు ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు, ఐపీఎస్, భారతీయ నాగరిక సురక్షా సంహిత సెక్షన్ 163 ప్రకారం నిషేధాజ్ఞలు జారీ చేశారు. ఈ ఆదేశాల ప్రకారం ఫిబ్రవరి 13న ఉదయం 6 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు సంబంధిత కౌంటింగ్ కేంద్రాల చుట్టూ 500 మీటర్ల పరిధిలో ఐదుగురికి మించిన గుంపులు కూడకుండా నిషేధం అమల్లో ఉంటుంది. ఆమనగల్, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, శంకర్‌పల్లి, మొయినాబాద్, చేవెళ్ల ప్రాంతాల్లో ఈ ఆదేశాలు అమలులో ఉంటాయని కమిషనర్ తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరించి శాంతి భద్రతలు కాపాడాలని విజ్ఞప్తి చేస్తూ, ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు చెల్లించాలని ఎంపీడీవో కు వినతి పత్రం



**ఆమనగల్లు, ఫిబ్రవరి 12(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు చెల్లించాలని కోరుతూ గురువారం ఆమనగల్లు ఎంపీడీవో కార్యాలయంలో కుసుమ మాధురి కి పోలేపల్లి గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇళ్ల బాధితులు వినతి పత్రం అందజేశారు. మొదటి విడుత బిల్లులు రాక ఇబ్బందులకు గురవుతున్నామని, వెంటనే బిల్లులు చెల్లించాలని ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఎంపీడీవోని కోరడం జరిగింది. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, బాధితులు తదితరులు పాల్గొన్నారు.

# కోనాపూర్ లో పూర్వ ప్రాథమిక పాఠశాల ప్రారంభోత్సవం

ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీడీవో, ఎంఈవో



**ఆమనగల్లు, ఫిబ్రవరి 12(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** ఆమనగల్లు మండలంలోని కోనాపూర్ గ్రామపంచాయతీలో ఈ విద్యా సంవత్సరానికి గాను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు అనుబంధంగా, పూర్వ ప్రాథమిక పాఠశాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ పూర్వ ప్రాథమిక పాఠశాలను ఎంపీడీవో కుసుమ మాధురి , ఆమనగల్లు మండల విద్యాధికారి పాండు తో కలిసి గురువారం ప్రారంభోత్సవం చేశారు. పాఠశాలకు ఒక టీచర్ , ఒక ఆయాని, నియమించారు. పాఠశాల విద్యార్థులకు, ఆటపాటలతో కూడిన విద్యా బోధన కొరకు అవసరమైన బోధన సామాగ్రి, ఆట వస్తువులు, మరియు ఫర్నిచర్ ను ప్రభుత్వం అందించింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి శ్రీలత, ఉపసర్పంచి రమేష్, వార్డు మెంబర్లు శ్రీనాథ్,శేఖర్, శ్రీలత, యువజన సంఘ సభ్యులు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ శోభారాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజేత, ఉపాధ్యాయులు స్వాతి,పద్మ, వినయ శ్రీలత, గ్రామ కార్యదర్శి రమ్య, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.


# కేంద్ర లేబర్ కోడ్లపై షాద్‌నగర్‌లో నిరసన జ్వాలలు



**షాద్‌నగర్, ఫిబ్రవరి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ల విధానాలకు వ్యతిరేకంగా షాద్‌నగర్‌లో సీఐటీయూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్. రాజు బైక్ ర్యాలీని ప్రారంభించి మాట్లాడుతూ, "కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలతో హక్కులను హరించేస్తోంది. స్వాతంత్ర్యానంతరం పోరాటాల ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, పెట్టుబడిదారులకు మేలు చేసేలా కొత్త కోడ్లు రూపొందించారు" అని మండిపడ్డారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు సుమారు 500 మంది అంగన్వాడీలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, రైతులు, కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. నినాదాలతో పట్టణం మార్మోగింది. నిరసన సభలో మాట్లాడుతూ నాయకులు, "హైర్ అండ్ ఫైర్ విధానంతో ఉద్యోగ భద్రత లేకుండా చేసి, శాశ్వత ఉద్యోగాలకు మంగళం పాడుతున్నారు. కార్మికుల యూనియన్ ఏర్పాటు, సమ్మె, నిరసన హక్కులను కట్టడి చేస్తున్నారు. 100 మంది స్థానంలో 300 మంది కార్మికులను అనుమతి లేకుండా తొలగించే అవకాశం కల్పించడం తీవ్ర అన్యాయం" అని ఆవేదన వ్యక్తం చేశారు. 'ఫ్లోర్ లెవల్ వేతనం' పేరుతో రోజుకు రూ. 178 మాత్రమే నిర్ణయించడం జీవనోపాధిని దెబ్బతీస్తుందని, 8 గంటల పని దినం స్ఫూర్తిని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, ఉపాధి హామీ, నేషనల్ హెల్త్ మిషన్ వంటి పథకాలలో పనిచేస్తున్న వారిని కార్మికులుగా గుర్తించకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. విద్యుత్ సవరణ చట్టం--2025, విత్తన సవరణ బిల్లు, ఎల్ఐసీలో 100 శాతం విదేశీ పెట్టుబడులు వంటి నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా జరగబోయే సార్వత్రిక సమ్మెలో తెలంగాణ కార్మికులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ నేతలు పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో బిసా సాయి బాబు, నర్సింలు, శీను నాయక్, వికలాంగుల హక్కుల వేదిక అధ్యక్షుడు ఆశన్న, భుజంగ రెడ్డి, అంగన్వాడీ నాయకురాలు జయమ్మ, జయ గౌడ్, ఊర్మిళ, స్వప్న, లలిత, అలివేలు, నాట్కో యూనియన్ నాయకులు మల్లేష్ గౌడ్, జైపాల్ రెడ్డి, అంజయ్య, గణేష్, కిషోర్, సుబ్బారావు, రవీందర్ రెడ్డి, ఆశా వర్కర్లు సుజాత, రమాదేవి, గిరిజన సంఘం ఉపాధ్యక్షుడు ఈశ్వర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్, ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, యుటిఎఫ్ కార్యదర్శి నర్సింలు, ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు రవీందర్ రెడ్డి, ముస్తఫా, జనవేదిక రాష్ట్ర నాయకులు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా ట్రాఫిక్ నియంత్రణ

- జిల్లా ఎస్పీ ఆదేశాలు




**మహబూబాబాద్, ఫిబ్రవరి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా జిల్లా ఎస్పీ డా. శభరిష్, ఐపీఎస్ ఆదేశాల మేరకు టౌన్ డీఎస్పీ తిరుపతిరావు సూచనల ప్రకారం కౌంటింగ్ కేంద్రాల వద్ద ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఈ మేరకు ఫిబ్రవరి 13వ తేదీ శుక్రవారం ఉదయం 5 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు ప్రత్యేక ట్రాఫిక్ నియంత్రణ అమల్లో ఉంటుంది. ఆర్టీసీ బస్టాండ్ నుండి ఈదులపూసపల్లి, కేసముద్రం వైపు వెళ్ళే వాహనాలు రామచంద్రాపురం మీదుగా పీఎస్ఆర్ కన్వెన్షన్ ప్రక్కనుండి వెళ్లవలసి ఉంటుంది. అలాగే కేసముద్రం, ఈదులపూసపల్లి నుండి మహబూబాబాద్‌కు వచ్చే వాహనాలు కూడా పీఎస్ఆర్ కన్వెన్షన్ ప్రక్కనుండి రామచంద్రాపురం మీదుగా టౌన్‌లోకి ప్రవేశించాల్సి ఉంటుంది. ప్రజలు పోలీసుల సూచనలు పాటించి సహకరించాలని, ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మహబూబాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి తెలిపారు.

# ఉపాధి పనులపై అవగాహన కల్పించిన అధికారులు




**తెలకపల్లి, ఫిబ్రవరి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలకపల్లి మండలం లక్నరం గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద పని చేస్తున్న కూలీలతో అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టెక్నికల్ అసిస్టెంట్ మోహన్ మాట్లాడుతూ, ఉపాధి పనుల్లో పాల్గొనే ప్రతి కూలీ రోజుకు రూ. 307 వేతనం పొందేలా కచ్చితంగా నాలుగు గంటల పాటు పని చేయాలని సూచించారు. ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అధిక సంఖ్యలో కూలీలు పనుల్లో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామస్థులు ఈ అవగాహన కార్యక్రమానికి స్పందించి, ఉపాధి పనుల్లో చురుకుగా పాల్గొనాలని సంకల్పం వ్యక్తం చేశారు.

# పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశంలో కీలక సూచనలు చేసిన డివిజనల్ అధికారి దేవకీ దేవి




**ఎలిగేడు, ఫిబ్రవరి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి భాస్కర్ రావు ఆధ్వర్యంలో ఎలిగేడు, జూలపల్లి మండలాల పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డివిజనల్ పంచాయితీ అధికారి దేవకీ దేవి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామ పంచాయతీలలో 100 శాతం పన్ను వసూళ్లు పూర్తి చేయాలని, ట్రేడ్ లైసెన్స్‌ల రిన్యువల్ ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై సమీక్ష జరిపి, పారిశుధ్య పనులు, సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణ, మొక్కలకు నీరు పోయడం, ఈజీఎస్ కింద నర్సరీల నిర్వహణ వంటి అంశాలను పర్యవేక్షించాలని ఆదేశించారు. అలాగే, గతంలో జరిగిన గ్రామ పంచాయతీ ఇన్స్పెక్షన్ రిమార్క్‌ను వెంటనే పీఎస్ యాప్‌లో పరిష్కరించాలని, రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసి సిద్ధంగా ఉంచాలని సూచించారు. వేసవి దృష్ట్యా తాగునీరు మరియు ఇతర అవసరాల కోసం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎలిగేడు, జూలపల్లి మండలాల ఎం.పి.ఓలు కిరణ్, శేషయ్య, సూరి తదితరులు పాల్గొన్నారు.

# మైసిగండి మైసమ్మ అమ్మవారి సన్నిధిలో హీరో సుమన్



**కడ్తాల్, ఫిబ్రవరి 12 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** కడ్తాల్ మండలం మైసిగండి మైసమ్మ అమ్మవారిని గురువారం సినీ హీరో సుమన్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో అయన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అయన వెంట కడ్తాల్ మండల బిజెపి మండల అధ్యక్షులు దోనాదుల మహేష్, మన్యా నాయక్, అశోక్, కాంటెకర్ నరేష్, తరుణ్, వెంకటేష్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

# ఘనంగా స్వపరిపాలన దినోత్సవం




**కడ్తాల్, ఫిబ్రవరి 12 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ ) :** కడ్తాల్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 36 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా ,అధికారులుగా విధులు నిర్వర్తించి స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. అదేవిధంగా ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమంలో భాగంగా హర్యానా రాష్ట్ర ప్రజలు ధరించే దుస్తులు ,వారి ఆహార విధానాలు మరియు ఆ రాష్ట్ర చిహ్నాలపై విద్యార్థులచే దుస్తులు ధరింపజేసి అక్కడి ఆహార పదార్థాలు తయారు చేసి అతిథులకు రుచి చూపించారు. ప్రాథమిక పాఠశాలలు యుపిఎస్, జిపిఎస్, పీస్ సాయిరెడ్డి గూడా నుండి 80 మంది విద్యార్థులు ,ఉపాధ్యాయులు పాఠశాలకు విచ్చేసి , పాఠశాలలో జరుగుతున్న వివిధ రకాలైన కోర్సులు వృత్తి విద్యలు వ్యవసాయం, బ్యూటీ అండ్ వెల్నెస్ ,కంప్యూటర్ అటల్ టింకరింగ్ ల్యాబ్ గేమ్స్ ,మ్యాస్ ల్యాబ్ లను సందర్శించారు .ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాధికారి నిర్మల హాజరై ఛాత్ర ఉపాధ్యాయులను అభినందించారు. మరియు పాఠశాల పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు .ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా సిద్దు, జిల్లా విద్యాధికారిగా మహేశ్వర్ వ్యవహరించారు . అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు .ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంగయ్య, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రజాక్ ,భాగ్యమ్మ ,నాగరత్నం ,భీమ్లా నాయక్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఉద్యోగ భద్రత కోసం మహేశ్వరంలో భారీ నిరసన

### - నడికుడ శివ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ




**మహేశ్వరం, ఫిబ్రవరి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలో ఉద్యోగ భద్రత, కార్మిక హక్కుల పరిరక్షణ కోసం ఐఎన్టీయూసీ కార్మిక శాఖ అధ్యక్షుడు నడికుడ శివ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలతో ఉద్యోగ భద్రతను దెబ్బతీస్తోంది. కార్మికుల సంక్షేమం, వేతనాల పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉంది" అని పేర్కొన్నారు.నిరసనలో భాగంగా మహేశ్వరం పట్టణంలో పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్మికులు, రైతులు, స్కీమ్ వర్కర్లు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొని నినాదాలతో పట్టణం మార్మోగించారు.నడికుడ శివ మాట్లాడుతూ, "కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, అసంఘటిత రంగ కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలి. స్కీమ్ వర్కర్లకు కనీసం రూ.26 వేల వేతనం ఇవ్వాలి. ఈఎస్ఐ, పీఎఫ్, గ్రాట్యుటీ ప్రయోజనాలు కల్పించాలి. ప్రభుత్వ రంగ సంస్థల వాటాల అమ్మకాన్ని ఆపాలి. రైతులకు మద్దతు ధర పెంచి ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి. ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలి. అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రతా పథకాలు ప్రవేశపెట్టాలి. కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేసి ప్రభుత్వమే జీతాలు చెల్లించాలి. వ్యవసాయ మార్కెట్లలో దడువాయి కార్మికుల రిటైర్మెంట్ వయస్సు 65 సంవత్సరాలకు పెంచాలి. మెడికల్ కాంట్రాక్ట్ ఎన్‌హెచ్ఎం ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా నియమించాలి. పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలి. నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలి" అని డిమాండ్ చేశారు.ఈ నిరసనలో కార్మిక సంఘాల నాయకులు, స్కీమ్ వర్కర్లు, రైతులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్లు రద్దు చేయాలంటూ నిరసన




**అచ్చంపేట, ఫిబ్రవరి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమ్మె జరిగింది. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద ఐఎన్టియుసి, ఏఐటియుసి, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఐఎన్టియుసి తాలూకా అధ్యక్షుడు మహబూబ్ అలీ మాట్లాడుతూ, నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని, కార్మికుల హక్కులను హరించేలా 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టిందని విమర్శించారు. 1970లో ఇందిరా గాంధీ 160 లేబర్ చట్టాలను చట్టబద్ధత కల్పించగా, ప్రస్తుతం మోడీ ప్రభుత్వం వాటిని రద్దు చేసి కార్మికుల జీవితాలతో ఆటలాడుతోందని ఆయన పేర్కొన్నారు.కార్మికులు ఏకమై పోరాడి, రాబోయే కాలంలో ఈ విధానాలను అడ్డుకోవాలని, అవసరమైతే ప్రభుత్వాన్ని గద్దె దించేంతవరకు పోరాటం కొనసాగుతుందని మహబూబ్ అలీ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా నాయకులు గోపాల్ పెర్మిల, ఏఐఎస్ఎఫ్ నరేష్, ప్రజా కళాకారుడు గోపాల్, ఐఎన్టియుసి తాలూకా కార్యదర్శి ఉస్మాన్, ఆటో ఐఎన్టియుసి వెంకటేష్, కాజా మియా, జహంగీర్, నిరంజన్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# టాస్క్ ఆధ్వర్యంలో అవగాహన తరగతులు




**పెద్దపల్లి,ఫిబ్రవరి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** పెద్దపల్లి జిల్లాలోని గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో టాస్క్ మహేంద్ర ప్రైడ్ క్లాస్ రూమ్ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్, పెద్దపల్లి టాస్క్ రీజనల్ ఇన్చార్జ్ డాక్టర్ కౌసల్య, టాస్క్ సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ భవాని పాల్గొన్నారు.కళాశాల చైర్మన్ మాట్లాడుతూ, విద్యార్థులకు డిగ్రీ విద్యతో పాటు నైపుణ్యాలు పెంపొందించడానికి ప్రతి సంవత్సరం టాస్క్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని తెలిపారు. డిగ్రీ చదివిన విద్యార్థులు కూడా సాఫ్ట్వేర్ ఉద్యోగాలు సాధించగలరని, ఇప్పటికే మా కళాశాల విద్యార్థులు అనేక ఎంఎన్సీ కంపెనీల్లో ఉద్యోగాలు పొందారని చెప్పారు.డాక్టర్ కౌసల్య విద్యార్థులు టాస్క్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచిస్తూ, కమ్యూనికేషన్, సాఫ్ట్ స్కిల్స్, అర్థమెటిక్ రీజనింగ్, ఇంటర్వ్యూ స్కిల్స్, ఎంప్లాయబిలిటీ స్కిల్స్ నేర్పించడం జరుగుతుందని వివరించారు.ఈ సందర్భంగా ట్రైనర్ భవాని విద్యార్థులకు కెరీర్ కోసం ఇంగ్లీషు భాష, మాట్లాడే కళ అను అంశాలపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ప్రిన్సిపల్ జే. రవీందర్, టాస్క్ ప్లేస్మెంట్ ఆఫీసర్ కే. కుమార్, ఎం.ఏ. సమద్, శారద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పుల్లేరు బోర్డు తండాలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్




**కడ్తాల్, ఫిబ్రవరి 12 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)** కడ్తాల్ మండలంలోని పుల్లేరు బోర్డు తండాలో గ్రామ ప్రజలకు.ఎన్ఎస్ఎస్ యూనిటీ 1,2,3 ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ బాబురావు,డాక్టర్ శశికళ, డాక్టర్ సరితరాణి లు స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తూ స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేయించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా వేరు వేరు విధాలుగా నిర్వహించుకోవాల్సిన అవసరాన్ని గ్రామ ప్రజలకు వివరించారు. స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్నప్పటి నుంచే అలవాట్లు పెంపొందించుకోవాలని వారు సూచించారు. అనంతరం అన్మాస్ పల్లి గ్రామం లోని శ్రీరామ రామేశ్వర వీరాంజనేయ స్వామి జ్ఞాన సరస్వతి క్షేత్రంలో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాయలగండి బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్ ఆవిష్కరణ



**అమ్రాబాద్, ఫిబ్రవరి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పదరా మండలంలోని రాయలగండి శ్రీ శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్‌ను బీసీ సంక్షేమ, పశువర్ధక, క్రీడల శాఖ మంత్రి వాకిట శ్రీహరి విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ, దేవాలయం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.ఈ సందర్భంగా మున్సిపాలిటీ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, అచ్చంపేట మాజీ ఎంపీపీ రామనాథం, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతల రాజగోపాల్, కుందాం మల్లికార్జున్, ఆనంద్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# మంత్రి వాకిటి శ్రీహరి సమక్షంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**అమ్రాబాద్, జనవరి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** అచ్చంపేట పట్టణంలో పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర క్రీడలు, పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి శంకుస్థాపనలు చేసి ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణతో కలిసి ఆయన ప్రజావసరాల ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు.సీసీ రోడ్ల నిర్మాణం, మినీ పార్క్ ఏర్పాటు, బస్తీ దవాఖాన నిర్మాణం వంటి పనులు పట్టణానికి మరింత మౌలిక వసతులు కల్పిస్తాయని మంత్రి తెలిపారు. ప్రతి వార్డు అభివృద్ధి చెందేలా ప్రణాళికాబద్ధంగా ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు.తర్వాత చంద్రసాగర్ చెరువు ఫిష్ ఫామ్‌ను సందర్శించిన మంత్రి, స్థానిక మత్స్యకారులతో సమావేశమయ్యారు. వారి సమస్యలు, అవసరాలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మత్స్యకారుల ఆదాయం పెరిగేలా ప్రత్యేక పథకాలు అమలు చేస్తామని, చేపల పెంపకానికి అవసరమైన సహాయం అందిస్తామని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్, అచ్చంపేట మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత మల్లేష్, మాజీ ఎంపీపీ రామనాథం, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతల రాజగోపాల్, ఆనంద్, మల్లికార్జున్, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెద్దపల్లిలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

-ఎమ్మెల్యే విజయరమణ



**పెద్దపల్లి, ఫిబ్రవరి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

పెద్దపల్లి మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సరళిపై ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం పెద్దపల్లి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పార్టీ అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలతో జరిగింది.ఎమ్మెల్యే మాట్లాడుతూ, మున్సిపల్‌లోని 36 వార్డులను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుని మున్సిపల్‌పై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. గత 20 రోజులుగా పార్టీ విజయం కోసం అహర్నిశలు కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఇచ్చిన మద్దతుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పట్టణ అభివృద్ధి కోసం కృషి చేస్తామని ఎమ్మెల్యే విజయరమణ రావు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు, సర్పంచులు, ఎన్నికల ఇన్చార్జులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# యూరియా అందక తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కొంటున్న రైతులు



**మానకొండూర్, ఫిబ్రవరి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

శెంకరపట్నం మండలంలోని తాడికల్ సహకార సంఘం పరిధిలో యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతులు జాతీయ రహదారిపై బైఠాయించారు. రవి సీజన్‌లో కావలసిన మోతాదులో యూరియా అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. “వ్యవసాయ పనులతో తీరిక లేకుండా ఉన్న మాకు రహదారిపై ధర్నా చేసే పరిస్థితి తీసుకొచ్చారు” అని వారు వాపోయారు. సకాలంలో యూరియా వేయకపోతే పంట దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.గ్రామీణ రైతులకు స్మార్ట్‌ఫోన్‌ల ద్వారా యూరియా బుకింగ్ చేయాలని ఆదేశాలు జారీ చేయడం వల్ల సమస్యలు మరింత పెరిగాయని రైతులు తెలిపారు. స్మార్ట్‌ఫోన్ లేని రైతుల పరిస్థితి ఏంటి? ఫోన్ ఉన్నవాళ్లు యాప్ ఓపెన్ చేస్తే స్టాక్ ముగిసిందని చూపిస్తోంది అని వారు ప్రశ్నించారు. ఈ విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతిలోనే యూరియాను అమ్మాలని, సరిపడా మోతాదులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా అందించాలని రైతులు ప్రభుత్వాన్ని వేడుకున్నారు.


# దేశవ్యాప్త సమ్మెలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల నిరసన



**గన్నేరువరం, ఫిబ్రవరి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

దేశవ్యాప్త సమ్మెలో భాగంగా గన్నేరువరం మండల కేంద్రంలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు, ఆశా కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈ కార్యక్రమం జరిగింది. అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు ముంజ రజిత మాట్లాడుతూ, అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఖర్చుల విషయంలో తేడాలు లేకుండా సమానంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తలకు ఫిక్స్ వేతనాలు చెల్లించాలని, అంగన్వాడీ టీచర్లకు అదనపు పనులు రద్దు చేయాలని, అర్హులైన వారికి ప్రమోషన్లు కల్పించాలని కోరారు.ఆశా వర్కర్లకు కేంద్రం పెంచిన జీతాలు అమలు చేయాలని, అంగన్వాడీ టీచర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్‌గా 2 లక్షలు, ఆయాలకు 1 లక్ష రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐకి వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి మండల కార్యదర్శి చుక్కల శ్రీశైలం, జిల్లా కౌన్సిలింగ్ సభ్యుడు కాంతాల అంజిరెడ్డి, యూనియన్ ప్రధాన కార్యదర్శి పులి శారద, ఆశా కార్యకర్తల అధ్యక్షురాలు సంపత్ లావణ్య, కార్యదర్శి విజయలక్ష్మి, ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి ముల్కల పవన్, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# సరోజిని నాయుడు స్ఫూర్తితో మహిళా శక్తిని మరింత బలోపేతం చేయాలి



భారతదేశపు నైటింగేల్‌గా పేరుగాంచిన సరోజిని నాయుడు జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటారు. 1879లో హైదరాబాద్‌లో జన్మించిన ఆమె చిన్న వయసులోనే కవిత్వంలో ప్రతిభ కనబరిచారు. పదమూడేళ్ల వయసులోనే ఇంగ్లీషులో కవితలు రాయడం ప్రారంభించి లండన్, కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్య అభ్యసించారు.దేశభక్తి, ప్రేమ, ప్రకృతి, మహిళా సాధికారత వంటి అంశాలను కవిత్వంలో ప్రతిబింబిస్తూ ఆమెను నైటింగేల్ ఆఫ్ ఇండియాగా గౌరవించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీ, నెహ్రూ వంటి నాయకులతో కలిసి ఉప్పు సత్యాగ్రహం, అసహకార ఉద్యమాల్లో పాల్గొని జైలు శిక్షలు అనుభవించారు. 1925లో భారత జాతీయ కాంగ్రెస్ తొలి మహిళా అధ్యక్షురాలిగా ఎన్నికై చరిత్ర సృష్టించారు. స్వాతంత్ర్యం అనంతరం ఉత్తరప్రదేశ్ తొలి మహిళా గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించారు.మహిళా హక్కుల కోసం ఆమె నిరంతరం పోరాడి విద్య, స్వావలంబన, సమాన హక్కులు అవసరమని బలంగా ప్రచారం చేశారు. ఆమె జీవితం మహిళలకు ప్రేరణగా నిలిచి ధైర్యం, పట్టుదల, విద్యతో ఏ శిఖరానికైనా చేరగలరనే సందేశాన్ని అందించింది.జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సరోజిని నాయుడు స్ఫూర్తితో మహిళా శక్తిని మరింత బలోపేతం చేయాలి.

**మహిళ శక్తి- దేశ శక్తి.**

వ్యాసకర్త
**వేల్పుల కవిత మహేందర్**
ఎమ్మెస్సీ,ఎంఫిల్,ఎంఈడీ



# పెట్టుబడిదారులకే మద్దతు

- మోడీ సర్కార్‌పై ఏఐటీయూసీ తీవ్ర విమర్శ




**నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో భారీ నిరసన జరిగింది. ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఆర్. శ్రీనివాసులు మాట్లాడుతూ, “మోడీ ప్రభుత్వం పెట్టుబడిదారులకే కొమ్ము కాస్తూ కార్మికుల హక్కులను హరించేలా నాలుగు లేబర్ కోడ్లు, విద్యుత్ సవరణ, విత్తన బిల్లులు తెచ్చింది” అని మండిపడ్డారు.కనీస వేతనాన్ని రూ.178గా నిర్ణయించడం, పని గంటలను 12కి పెంచడం కార్మికులపై దాడి అని పేర్కొన్నారు. రైతాంగం, పేద కుటుంబాలను దూరం చేయడానికి పథకాల నిధులు తగ్గిస్తున్నారని ఆరోపించారు.ఆశా కార్యకర్తల పెండింగ్ వేతనాలు చెల్లించాలని, కనీస వేతనం, ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గాంధీ పార్కులో సభ అనంతరం బస్టాండ్ సెంటర్‌లో మానవహారం, ధర్నా నిర్వహించారు.

# శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి జాతర పోస్టర్ విడుదల



**పదర, ఫిబ్రవరి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

పదర మండల రాయలగండి జాతర వాల్ పోస్టర్‌ను మంత్రి వాకాటి శ్రీహరి, స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ విడుదల చేశారు. ఈ నెల 21 నుండి 25 వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు సంబంధించి అచ్చంపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరణ జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ, జాతర ఏర్పాట్లు సమగ్రంగా చేయాలని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సూచించారు.కార్యక్రమంలో గార్లపాటి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రామానాదం, కుంద మల్లిఖార్జున్, ఛత్రు నాయక్, అనిల్, అనంతరెడ్డి, చింతలరాజ్ గోపాల్, జనార్దన్, ఆనంద్, రేణు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ అంబ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



**వెల్దండ, ఫిబ్రవరి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

వెల్దండ మండల గుండాల గ్రామంలోని శ్రీ అంబ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో జరగనున్న బ్రహ్మోత్సవాలకు అదనపు కలెక్టర్ అమరేందర్, పరిపాలన అధికారి చంద్రశేఖర్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు.ఈ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, సర్పంచ్, అర్చకులు కలిసి బ్రహ్మోత్సవాలకు రావాలని ఆహ్వానించారు. జాతర విజయవంతం కావడానికి అన్ని వర్గాల సహకారం అవసరమని కమిటీ వైస్ చైర్మన్ అరుణ్ నాయక్ పేర్కొన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పర్వత్ రెడ్డి, కమిటీ సభ్యులు అంజయ్య, తిరుపతయ్య, దేవాలయ కార్యనిర్వాహక అధికారి ప్రసాద్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ఎర్రబస్సు ఎరుగని పాలకుర్తి మండల కేంద్రం



**పాలకుర్తి, ఫిబ్రవరి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

పాలకుర్తి మండల కేంద్రం పేరుకే మండల కేంద్రం కానీ ఇప్పటి వరకు ఎర్రబస్సు సౌకర్యం అందలేదు. మూడు సంవత్సరాల క్రితం వరకు గోదావరిఖని డిపో నుండి బసంతనగర్, పాలకుర్తి మీదుగా ఈశాల తక్కల్లపల్లి గ్రామం వరకు ఆర్టీసీ బస్సు రోజుకు రెండు ట్రిప్పులు నడిచేది. అయితే ఏ కారణం లేకుండా బస్సు సౌకర్యం నిలిపివేయడంతో విద్యార్థులు, కార్మికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు.మహిళలు మహాలక్ష్మి ఫ్రీ బస్సు పథకం వినియోగించుకునే అవకాశం లేక నిరుత్సాహానికి గురవుతున్నారు. గోదావరిఖని, పెద్దపల్లి, కరీంనగర్ వంటి దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ప్రజలు రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్ స్పందించి ఆర్టీసీ అధికారులతో మాట్లాడి గోదావరిఖని డిపో, పెద్దపల్లి బస్టాండ్ నుండి బసంతనగర్, పాలకుర్తి మీదుగా ఈశాల తక్కల్లపల్లి వరకు ప్రతిరోజు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

# కొత్త రకం జొన్న సాగు పద్ధతిపై అవగాహన



**హుస్నాబాద్, ఫిబ్రవరి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

అక్కన్నపేట్ మండలంలోని శ్రీరామ్ తండా గ్రామంలో రైతు పొలంలో కొత్త రకం జొన్న పి.వై.పి.ఎస్--2 (పాలెం పచ్చ జొన్న--1) సాగుపై పద్ధతి ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమం వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీలత ఆధ్వర్యంలో, తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం సిద్దిపేట శాస్త్రవేత్తలతో కలిసి జరిగింది.శాస్త్రవేత్త పల్లవి మాట్లాడుతూ ఈ రకం వానాకాలం, యాసంగి కాలాల సాగుకు అనుకూలమని, పంట కాలం 100--110 రోజులు ఉంటుందని తెలిపారు. తక్కువ ఎత్తు పెరిగే ఈ జొన్న రకం గింజ బూజు తెగులు, మొవ్వ చంపు ఈగ, కాండం తొలుచు పురుగులను తట్టుకుని ఎకరానికి 10--12 క్వింటాళ్ల దిగుబడి ఇస్తుందని వివరించారు. పశువుల మేతకు ఉపయోగిస్తే ఎకరానికి 50--55 క్వింటాళ్లు వస్తాయని, రైతులకు ఇది లాభదాయకమైన ప్రత్యామ్నాయ పంటగా నిలుస్తుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బానోత్ వెంకటేష్, ఉప సర్పంచ్ రాజు, పంచాయతి కార్యదర్శి సంపత్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# మహేశ్వరం సర్కిల్‌లో శివాజీ విగ్రహం ఏర్పాటు

- దళిత సంఘాల నిరసన







**మహేశ్వరం, ఫిబ్రవరి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ముందు సర్కిల్‌లో రాత్రికి రాత్రి శివాజీ విగ్రహం ఏర్పాటు చేయడంతో వివాదం చెలరేగింది. బీజేపీ నాయకులు విగ్రహాన్ని తీసుకువచ్చి బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాల పక్కన ఉంచడంతో దళిత సంఘాల నాయకులు, ప్రజలు హుటాహుటిన చేరుకుని నిరసన తెలిపారు. "శివాజీ విగ్రహం పెట్టడంపై మాకు అభ్యంతరం లేదు. కానీ జగ్జీవన్ రామ్, అంబేద్కర్ విగ్రహాల పక్కన పెట్టడం సరైంది కాదు. పర్మిషన్ తీసుకుని వేరే చోట ఏర్పాటు చేస్తే మేము సహకరిస్తాం" అని దళిత నాయకులు స్పష్టం చేశారు. ఈ ఘటనపై పోలీసులు జోక్యం చేసుకుని, అనుమతి లేకుండా విగ్రహం ఏర్పాటు చేయడం తప్పు అని బీజేపీ నాయకులకు హెచ్చరించారు. విగ్రహాన్ని అక్కడి నుంచి తొలగించి వేరే చోట ఏర్పాటు చేయాలని సూచించారు. బీజేపీ నాయకులు, "మాకు న్యాయం జరగాలి. శివరాత్రి బ్రహ్మోత్సవాల తర్వాత పెద్దల సమక్షంలో, అధికార అనుమతితో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం" అని తెలిపారు. ఈ ఘటనలో వివిధ గ్రామాల సీనియర్ నాయకులు, అఖిలపక్ష ప్రతినిధులు, కుల సంఘాలు పాల్గొని ధర్నా నిర్వహించారు.

## మహబూబాబాద్, కేసముద్రం మున్సిపాలిటీలలో కాంగ్రెస్ ఆధిక్యం సాధిస్తుందని ఎమ్మెల్యే డా. మురళీ నాయక్ ధీమా



**మహబూబాబాద్, ఫిబ్రవరి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే డా. మురళీ నాయక్ మాట్లాడుతూ, "మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఎం అభ్యర్థులు అధిక స్థానాల్లో విజయం సాధించి మహబూబాబాద్, కేసముద్రం మున్సిపాలిటీలను కైవసం చేసుకుంటారు" అని ధీమా వ్యక్తం చేశారు. గత 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో నేతలు ప్రజా సమస్యలను విస్మరించి, దోచుకున్న డబ్బును విచ్చలవిడిగా వెదజల్లుతూ ఓటర్లను ప్రలోభపెట్టారని ఆయన ఆరోపించారు. అయితే ప్రజలు కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను చూసి నమ్మి ఓటు వేస్తారని తెలిపారు. కేసముద్రం మున్సిపాలిటీలో 86 కోట్ల రూపాయలతో రహదారులు, సెంట్రల్ లైటింగ్ సిస్టం, మురుగు కాలువలు వంటి అభివృద్ధి పనులు చేపట్టినందున, 16 వార్డుల్లో 12 వార్డులు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలుస్తారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉమా, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధికి సహకారం అందించండి

- సర్పంచ్ ప్రవీణ్ విజ్ఞప్తి



**ఎలిగేడు, ఫిబ్రవరి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు పంచాయతీరాజ్ అధికార యంత్రాంగం సహకారం అందించాలని గ్రామ సర్పంచ్ కప్పల ప్రవీణ్ విజ్ఞప్తి చేశారు. గురువారం ఎలిగేడు గ్రామపంచాయతీ కార్యాలయానికి తొలిసారి వచ్చిన జిల్లా పంచాయతీ అధికారి (డిఎల్పిఓ) దేవకి దేవిని గ్రామ కార్యదర్శి అంజలి, సర్పంచ్ ప్రవీణ్ శాలువాతో సత్కరించి బొకే అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి పనుల గురించి డిఎల్పిఓ అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు తమ వంతు సహాయ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆమె హామీ ఇచ్చారు.

# లేబర్ కోడ్స్, జాతీయ విత్తన మరియు విద్యుత్ సవరణ బిల్లులను రద్దు చేయాలి

పాలడుగు నాగార్జున డిమాండ్



**నల్లగొండ, ఫిబ్రవరి 12 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** గత 11 సంవత్సరాలుగా కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రజల హక్కులను కాలరాస్తూ, కార్మికులకు వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు నాగార్జున తీవ్రంగా విమర్శించారు. కార్మికులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన లేబర్ కోడ్స్, గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే చర్యలు, జాతీయ విత్తన బిల్లు, విద్యుత్ సవరణ బిల్లులను వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ రోజు సీఐటీయూ ఆధ్వర్యంలో కంచనపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చడం ద్వారా కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం హరించిందని విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చిన 70 సంవత్సరాలు దాటినా కూడా కార్మికులు కనీస వేతనానికి నోచుకోకపోవడం దురదృష్టకరమన్నారు. కనీస వేతన చట్టాన్ని కఠినంగా అమలు చేసి, నెలకు రూ.26,000 కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వామపక్షాల పోరాట ఫలితంగా 2005లో వచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం వల్ల గ్రామీణ పేదలు, వ్యవసాయ కార్మికుల జీవనంలో మార్పులు వచ్చాయని గుర్తుచేశారు. అయితే ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా జాతీయ విత్తన బిల్లును తీసుకువచ్చి విత్తన రంగాన్ని బహుళజాతి కంపెనీలకు అప్పగించే ప్రయత్నం జరుగుతోందని తెలిపారు. విద్యుత్ సవరణ చట్టం ద్వారా స్మార్ట్ మీటర్లు అమలు చేసి ముందస్తుగా బిల్లులు వసూలు చేయడం, ఉచిత విద్యుత్‌ను భవిష్యత్తులో నిలిపివేసే పరిస్థితులు తీసుకురావడం జరుగుతోందని విమర్శించారు. విద్యుత్ బిల్లులను పెంచి కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో 100% విదేశీ పెట్టుబడులను అనుమతించడం, బ్యాంకింగ్ మరియు ఇన్సూరెన్స్ రంగాలను బహుళజాతి కంపెనీలకు అప్పగించడం అన్యాయమని తెలిపారు. ప్రజల హక్కుల పరిరక్షణ కోసం సిపిఎం నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ పోలే సత్యనారాయణ, సీఐటీయూ మండల నాయకులు ఇరిగి దున్న అనిల్, సింగపంగా లింగమ్మ, ఏనుగు వాణి, బుల్లోజు భారతమ్మ, సింగపంగా కిరణ్, గాదె యాదయ్య, సోమనబోయిన శ్రీను, యాదయ్య, నర్సిరెడ్డి, ధనంజయ, సుధాకర్, మల్లేష్, శంకర్, సమీనా, సువర్ణ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్ల రద్దు

-కార్మికుల హక్కుల పరిరక్షణకు వేముల మారయ్య డిమాండ్




**హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ గురువారం హెచ్ఎంటీ నాచారం వద్ద భారీ నిరసన ర్యాలీ జరిగింది. భారత రాష్ట్ర సమితి ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేముల మారయ్య మాట్లాడుతూ, "కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలి. గతంలో రద్దు చేసిన 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలి. కార్మికుల హక్కులను కాలరాసే విధానాలను వెనక్కు తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు. అలాగే, తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న ఉచిత ఆర్టీసీ బస్సు మహాలక్ష్మి పథకం కారణంగా ఆటో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, "ములిగే నక్కమీద తాటిపండు పడినట్టే కేంద్ర ప్రభుత్వ తీరు ఉంది" అని వ్యాఖ్యానించారు. దేశవ్యాప్త సమ్మెకు మద్దతు తెలిపిన కార్మిక సంఘాలకు, బీఆర్టీయూ సంఘాల డ్రైవర్లందరికీ ధన్యవాదాలు తెలిపారు.

## కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలి






-వ్యవసాయ రైతు వ్యతిరేక విధానాలు నశించాలి
-దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదం
-భీమగాని గణేష్ సిఐటియు తిప్పర్తి మండల కన్వీనర్‌నీ

**నల్లగొండ, ఫిబ్రవరి 12( నీలగిరి ఎక్స్ ప్రెస్):** కేంద్ర ప్రభుత్వ ప్రజా కార్మిక రైతు వ్యతిరేక విధానాలకు నశించాలి నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలి ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించాలని రైతాంగ సమస్యను పరిష్కరించాలని సిఐటియు తిప్పర్తి మండల కన్వీనర్ భీమగాని గణేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు గురువారం తిప్పర్తిలో సిఐటియు ఆధ్వర్యంలో సమ్మె సందర్భంగా మార్కెట్ యార్డ్ నుండి సెంటర్ నుండి ఎమ్మార్వో ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించి ఎమ్మార్వో ఆఫీస్ ముందు ధర్నా చేయడం జరిగింది ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలను రద్దుచేసి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ను కారు చౌకగా కార్పొరేట్ శక్తులకు అమ్ముతూ దేశ సార్వభౌమత్వాన్ని తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని ఉపాధి హామీ చట్టాన్ని కాపాడాలని విభజీ రాంజీ పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు వ్యతిరేకంగా తెచ్చిన విత్తన విద్యుత్ సవరణ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ వర్కర్స్, వివోఏ, ఆశ వర్కర్స్, మధ్యాహ్నం భోజనం, భవన నిర్మాణ,హమలి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వారికి కనీస వేతనం 26000 నిర్ణయించాలని ఆశలకు ఫిక్స్ వేతనం నిర్ణయించి వేతనాలు ఇవ్వాలని సెర్ఫ్ ద్వారా కనీస వేతనం నిర్ణయించి ఇవ్వాలని అన్నారు, గ్రామపంచాయతీ కార్మికులకు మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, మధ్యాహ్నం భోజనం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, భావన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు పరిరక్షించాలని, పెండింగ్లో ఉన్న క్లెయిమ్స్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు, కార్మికులపై అధికారుల వేధింపులను అరికట్టాలని, పిఎఫ్, ఈఎస్ఐ ప్రమాద బీమా సౌకర్యం ప్రతి కార్మికులకు కల్పించాలని కార్మిక హక్కుల రక్షణ కోసం ప్రతి ఒక్క కార్మికులు పోరాటంలో పాల్గొనాలని పోరాటం ద్వారానే హక్కులు సాధించుకోవడం జరుగుతుందని అన్నారు ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మన్నెం బిక్షం గండమల్ల రాములు డివైఎఫ్ఐ మండల కార్యదర్శి పోకల శశిధర్ సిఐటియు జిల్లా నాయకురాలు మంత్రాల మంగమ్మ యూనియన్ నాయకులు కంచర్ల జానయ్య, పాలడుగు చంద్రయ్య, యం.డి.రూమణ, జక్కల అనిత, టి. పార్వతమ్మ,దాసరి నిర్మల,పోలగోని యాదమ్మ, కిన్నెర సైదమ్మ, జిల్లాల సుధాకర్ రెడ్డి, శ్రీను, గోనే శ్యాంసుందర్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## కల్వకుర్తి చైర్మన్ పీఠం కాంగ్రెస్ ఖాతాలోకి?




**కల్వకుర్తి, ఫిబ్రవరి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ ఆధిక్యం స్పష్టమవుతోందని, చైర్మన్ అభ్యర్థి బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ విజయం సాధించే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, బాలాజీ సింగ్ ల కృషి కాంగ్రెస్‌కు అనుకూలంగా మారాయని విశ్లేషకుల అభిప్రాయం. ప్రజలకు అందుబాటులో ఉండి అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానని బృంగి రత్నమాల తెలిపారు. ప్రజల ఆశీస్సులతో అఖండ మెజార్టీ సాధిస్తామనే విశ్వాసం వ్యక్తం చేశారు.

# బంగ్లాదేశ్ మాదిరిగానే భారత్‌కి వస్త్రాలపై జీరో టారిఫ్



**న్యూఢిల్లీ ఫిబ్రవరి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బంగ్లాదేశ్ మాదిరిగానే భారత్‌కి వస్త్రాలపై సున్నా శాతం సుంకాలు అందుబాటులోకి రానున్నాయని కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖామంత్రి పీయుష్ గోయల్ వెల్లడించారు. అమెరికా- బంగ్లాదేశ్ వాణిజ్య ఒప్పందం వల్ల దాదాపు 20 శాతం టారిఫ్‌లను 19 శాతానికి తగ్గాయి. ప్రత్యేకించి వస్త్ర రంగం అభివృద్ధి, వాణిజ్యం కోసం అమెరికా పత్తితో.. బంగ్లాదేశ్ తయారు చేసిన ప్రత్యేక వస్త్ర ఉత్పత్తులకు అమెరికా సున్నాశాతం సుంకాల్ని విధించింది. ఈ విషయాన్ని ఇరుదేశాలు బహిరంగంగా ప్రకటించాయి. మరోవైపు బంగ్లాదేశ్ కంటే ముందే భారత్‌తో ఒప్పందం చేసుకున్నామని అమెరికా అధ్యక్షుడు ప్రకటించినా.. భారత్‌కి మాత్రం వస్త్ర ఉత్పత్తులపై 18 శాతం సుంకాల్ని విధించారు. దీనిపై ప్రతిపక్షాలు మోడీ ప్రభుత్వంపై మండిపడ్డాయి. ఈ విషయంపై మీడియా ప్రతినిధులు తాజాగా వాణిజ్యశాఖామంత్రి పీయుష్ గోయల్‌ని ప్రశ్నించారు. దీనికి ఆయన 'బంగ్లాదేశ్ మాదిరిగానే భారత్ కూడా వస్త్ర ఉత్పత్తులపై జీరో టారిఫ్ పొందుతుంది. ప్రస్తుతం ఈ ఒప్పందానికి సంబంధించి ఫ్రేమ్ వర్క్ జరుగుతుంది. ఈ ఒప్పందం ఖరారు అయినప్పుడు దీన్ని ముద్రణ కాపీ ద్వారా మీరు చూడవచ్చు' అని ఆయన అన్నారు.

# కశ్మీర్ అందాలు ఆస్వాదిస్తూ.. దాల్ సరస్సులో పర్యాటకుల బోట్ రైడ్




**శ్రీనగర్ ఫిబ్రవరి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భూతల స్వర్గంగా పేరుగాంచిన జమ్మూకశ్మీర్ అందాలు పర్యాటకులను ఎంతలా మంత్రముగ్ధులను చేస్తాయో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. శ్రీనగర్‌లోని అత్యంత అందమైన పర్యాటక ప్రదేశాల్లో టాప్‌లో ఉంటుంది దాల్ సరస్సు. ఫ్లవర్స్ లేక్ అని, శ్రీనగర్ జ్యువెల్ అని పిలువబడే ఈ సుందర ప్రదేశం పర్యాటకుల తాకిడితో సందడిగా మారింది.శ్రీనగర్‌కు సమీపంలో ఉన్న ఈ దాల్ సరస్సులో పర్యాటకులు శీతాకాల బోట్ రైడ్‌ను ఎంజాయ్ చేస్తూ.. అక్కడి అందాలను ఆస్వాదిస్తున్నారు. ఓ వైపు కశ్మీర్ అందాలు.. మరో దాల్ సరస్సులో బోటు రైడ్ చేస్తూ.. ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ మైమరిచిపోతున్నారు పర్యాటకులు.

# తెలంగాణ జాగృతి పార్టీ పెట్టడం పక్కా

మొదటి తరువాయి

తనపై దాడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన పక్కన పైరవీకారులు లేరని.. ఎప్పుడూ ఉద్యమకారులే ఉన్నారని ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు కవిత. గురువారం నాడు బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కల్యాణమండపంలో జాగృతి ఆధ్వర్యంలో ఉద్యమకారుల ఆత్మగౌరవ సభ జరిగింది. ఈ సభలో కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ.. ఉద్యమకారులను పట్టించుకోలేదు కాబట్టే ఆ పెద్ద మనిషి అధికారం కోల్పోయారంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ని పరోక్షంగా విమర్శించారు. గత పాలకులు అహంకారం ఎక్కువై ఓడిపోయారంటూ బీఆర్ఎస్ పార్టీ నేతలపై విమర్శలు సంధించారు. కేసీఆర్ హయాంలో అసెంబ్లీ ముందు ఉద్యమకారుడు ఆత్మాహుతి చేసుకుని చనిపోయాడన్నారు. సీఎం రేవంత్ రెడ్డిని సైతం ఉద్యమకారులు బంగ్లా నుంచి బయటకు గుంజుతారని జోస్యం చెప్పారు. తెలంగాణ వచ్చిన తర్వాత 63 సీట్లతో అధికారం ఇస్తే.. అన్ని పార్టీలను విలీనం చేసుకున్నారంటూ కాంగ్రెస్ పార్టీపై ఆమె నిప్పులు చెరిగారు. ఇక బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హయాంలో ప్రజాస్వామ్య విలువలు కాల రాయబడ్డాయన్నారు. ఇందిరా పార్క్ వద్ద ధర్నా చౌక్ ఎత్తేశారని.. సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తే అరెస్టులు చేశారంటూ కవిత ఆందోళన వ్యక్తం చేశారు. అప్పట్లో ఎవర్ని గెలిపించినా.. బీఆర్ఎస్ పార్టీలోకే వెళ్తారన్న పరిస్థితి వచ్చిందన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాత.. చిన్న వారికి లాభం జరగలేదని తెలిపారు. కానీ మెగా కృష్ణారెడ్డి మాత్రమే కుబేరుడు అయ్యాడంటూ వ్యంగ్యంగా అన్నారు. అలాగే ఉద్యమకారులకు న్యాయం చేసే బాధ్యత తీసుకోవాలంటూ ప్రొఫెసర్ కోదండరాంకు ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత సూచించారు. ప్రొ.కోదండరాం, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి తదితరుల లాంటి వారి వల్లే సీఎం రేవంత్ రెడ్డిని ఉద్యమకారులు నమ్మారన్నారు. అయితే రెండేళ్లుగా ఎందుకు మాట్లాడటం లేదంటూ ప్రొ.కోదండరాంను ఈ సందర్భంగా కవిత సూటిగా ప్రశ్నించారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలంటూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో తెలంగాణ సంక్షేమ బోర్డు ప్రకటన చేయాలంటూ రేవంత్ ప్రభుత్వాన్ని కవిత డిమాండ్ చేశారు. ప్రైవేట్ ఉద్యోగాల్లో 25 శాతం కోటాను ఉద్యమకారుల పిల్లలకు కేటాయించాలని ప్రభుత్వాన్ని కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు.మలిదశ తెలంగాణ ఉద్యమం మొదలైన ఆరేండ్ల తర్వాత కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సమితి పెట్టారని మాజీ ఎమ్మెల్సీ కవిత అన్నారు. 1995లో వరంగల్ డిక్లరేషన్ తో మలిదశ తెలంగాణ ఉద్యమం మొదలైందని ఆమె చెప్పారు. స్వరాష్ట్ర ఉద్యమంలో మారోజు వీరన్న, గద్దర్ లాంటి వారు కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఈ తెలంగాణ గడ్డపై విరామం లేకుండా ఒకదాని తర్వాత మరొక ఉద్యమం కొనసాగుతూనే వచ్చిందన్నారు. 2001లో కేసీఆర్ టీఆర్ఎస్ పెట్టారని, నిప్పుకణికలా మండుతున్న ఉద్యమాన్ని అగ్గిరాజేసిండని అన్నారు. 2014లో తెలంగాణ తెచ్చుకున్నంక ఉద్యమకారులకు దక్కుతదని అనుకున్నమో వారికి న్యాయం జరగలేదు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఉద్యమకారులకు సరైన న్యాయం జరగలేదని ఎక్కడైనా ఉద్యమకారులకు పదవులు దక్కితే వారు మిగతా వారిని పురుగులను చూసినట్లు చూశారని విమర్శించారు.

# దెబ్బతిన్న రిలేషన్‌లో.. ఇష్టపూర్వక శృంగారాన్ని రేప్‌గా భావించలేం !



**తిరువనంతపురం ఫిబ్రవరి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కేరళ ఎమ్మెల్యే రాహుల్ మమ్‌కూటతిల్ కేసులో హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. రేప్, అబార్షన్ కేసులో ఇప్పటికే ఆ ఎమ్మెల్యేకు ముందస్తు బెయిల్ మంజూరీ చేసిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యే రాహుల్, బాధితురాలి మధ్య ఉన్న రిలేషన్ సమ్మతి ప్రకారం కొనసాగినట్లు కోర్టు పేర్కొన్నది. తొలుత ఇష్టపూర్వకంగా శృంగారంలో పాల్గొని, ఆ తర్వాత రిలేషన్ దెబ్బతింటే, అలాంటి కేసుల్లో శృంగారాన్ని అత్యాచారంగా భావించలేమని జడ్జి కౌసర్ ఎడప్పగాత్ తెలిపారు. ఇద్దరు వయోజనులు స్వచ్ఛందంగా సమ్మతితో శృంగారంలో పాల్గొని, అలా వాళ్లు కొన్నాళ్లు ఆ రిలేషన్‌ను కొనసాగితే, అప్పుడు అది ఇష్టపూర్వకమైన చర్య అవుతుందని, కానీ ఆ అంశాన్ని భాగస్వామిపై లైంగిక దాడిగా చూడలేమని జడ్జి తన ఆదేశాల్లో పేర్కొన్నారు.తీర్పు సందర్భంగా సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలను కూడా ఆ జడ్జి గుర్తు చేశారు. ఇష్టపూర్వకంగా ఏర్పడిన బంధానికి బ్రేకప్ చెబితే, అలాంటి రిలేషన్‌లో నేరపూరిత రేప్ చట్టాలను ప్రయోగించలేమని సుప్రీంకోర్టు గతంలో పేర్కొన్న విషయాన్ని జడ్జి వెల్లడించారు. బంధం బలహీనపడినంత మాత్రాన, దాన్ని రేప్‌గా చిత్రీకరించలేమని, అలాంటి చర్యలను ఖండిస్తున్నట్లు సుప్రీం పేర్కొన్నదని తన ఆదేశాల్లో జడ్జీ చెప్పారు. ఎమ్మెల్యే రాహుల్, బాధితురాలి మధ్య జరిగిన వాట్సాప్ సంభాషణ అంశాలను కోర్టు బయటపెట్టింది. బాధితురాలి సమ్మతితోనే అబార్షన్ జరిగినట్లు చాట్ ద్వారా తెలిసినట్లు కోర్టు చెప్పింది. అబార్షన్ కోసం ట్యాబ్లెట్లను బాధితురాలే అడిగిందని, ఆమె తన లొకేషన్ కూడా షేర్ చేసిందని, ఎమ్మెల్యే స్నేహితుడి నుంచి మెడిసిన్ కూడా అందుకున్నట్లు వాట్సాప్ ఛాటింగ్‌లో ఉన్నట్లు కోర్టు పేర్కొన్నది.

# చైనాలో షాకింగ్ ఘటన..

## పది మీటర్ల లోతుకు కుంగిపోయిన రోడ్డు..



**న్యూఢిల్లీ ఫిబ్రవరి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చైనాలో నిర్మాణాలు కొన్ని ఎంత గొప్పగా ఉంటాయో ఇంకొన్ని అంత నాసిరకంగా ఉంటాయి. పలు బ్రిడ్జిలు, బిల్డింగులు కూలిపోవడం, రోడ్లు కుంగిపోవడం వంటి ఘటనలు అక్కడ మామూలే. ఇక ఇటీవలి కాలంలో ప్రధాన నగరమైన షాంఘైలో రోడ్లు చాలా చోట్ల కుంగిపోతున్నాయి. దీనికి సంబంధించి తాజాగా ఒక షాకింగ్ వీడియో విడుదలైంది.ఒక రోడ్డు దాదాపు పది మీటర్ల లోతులోకి కుంగిపోయింది. అంతేకాదు.. రోడ్డు పక్కన ఉన్న ఇండ్లు వంటి నిర్మాణాలు కూడా ఆ గోతిలో కూరుకుపోయాయి. ఈ దృశ్యం అంతా అక్కడి సెక్యూరిటీ కెమెరాలో రికార్డైంది. వీడియో చూస్తే అక్కడి నిర్మాణ రంగం ఎంత నాసిరకంగా ఉందో అర్థమవుతుంది. చాలా బిజీగా ఉండే పెద్ద రోడ్డు ఇలా గోతిలోపలికి కూరుకుపోయింది. ఈ ఘటన 2024 జనవరిలో జరగగా, తాజాగా వీడియో విడుదలైంది. ఒక మురికి నీటి పైప్ లైన్ ఫెయిల్యూర్ వల్ల ఈ పరిస్థితి తలెత్తిందని అక్కడి అధికారులు చెబుతున్నారు. ఈ రోడ్లు, ఇతర నిర్మాణాలు గోతుల్లో కూరుకుపోవడం (సింక్ హోల్స్) ఇటీవల ఎక్కువవుతున్నాయి. దీనిపై 2017-2023కు సంబంధించిన నివేదికను చైనా విడుదల చేసింది. 72 శాతం నిర్మాణాలు కుంగిపోవడానికి మానవ తప్పిదాలు, మానవ చర్యలే కారణమని తేల్చారు. నాసిరకం నిర్మాణాలు, నిర్వహణా లోపాలు, మట్టి బలంగా లేకపోవడం, పైపొరలు, ఇసుక బలహీనంగా ఉండటం, ఎక్కువ శాతం భూగర్భ జలాల్ని వాడటం, భూమి పొరల్లో ఖాళీలు ఉండటం వంటివి సింక్ హోల్స్‌కు కారణాలుగా చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఇకపై భద్రతా ప్రమాణాలు మెరుగుపర్చాలని అధికారులు భావిస్తున్నారు.

# స్పీకర్ ఛాంబర్‌లో కాంగ్రెస్ ఎంపీల అరుపులు..

## వీడియో రిలీజ్ చేసిన మంత్రి రిజిజు



**న్యూఢిల్లీ ఫిబ్రవరి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పార్లమెంట్‌లో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య రోజు రోజుకూ వైరం పెరుగుతున్నది. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు మరో వీడియోను రిలీజ్ చేశారు. కొన్ని రోజుల క్రితం కాంగ్రెస్ ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఛాంబర్‌లోకి వెళ్లి గట్టిగా అరిచారు. ఆ వీడియోను కాంగ్రెస్ ఎంపీలే తీసినట్లు మంత్రి రిజిజు పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎంపీ జ్యోతిమణి .. కేంద్ర మంత్రి రిజిజు వైపు తన వేలెత్తి చూపి గట్టిగా అరిచినట్లు ఆ వీడియోలో ఉన్నది.బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే సభలో మాట్లాడిన రోజున ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. ఆయన తన ప్రసంగంలో మాజీ ప్రధానులను విమర్శించారు. నెహ్రూ-గాంధీ కుటుంబంపై కొన్ని వ్యాఖ్యలు చేశారు. సభకు పుస్తకాలు తీసుకువచ్చిన దూబే.. ఆ పుస్తకాల్లో ఉన్న అంశాలను ప్రస్తావిస్తూ ఆయన నెహ్రూ-గాంధీ ఫ్యామిలీపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. ఆ ఘటన నేపథ్యంలో ప్రియాంకా గాంధీ, కేసీ వేణుగోపాల్ నేతృత్వంలోని కాంగ్రెస్ నేతలు స్పీకర్ ఛాంబర్‌లోకి వెళ్లి దూబేపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ ఓ బుక్ నుంచి అంశాన్ని ప్రస్తావిస్తే వ్యతిరేకించారని, కానీ దూబే కొన్ని బుక్స్ నుంచి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. స్పీకర్ ఛాంబర్‌లో జరిగిన రభస గురించి పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి రిజిజు స్పందిస్తూ కాంగ్రెస్ నేతల ప్రవర్తనను విమర్శించారు. ప్రియాంకా, వేణుగోపాల్ లాంటి సీనియర్ నేతల ముందు అలా జరగడం శోచనీయమన్నారు. మేం ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ఇలాంటి ఘటనలు జరగలేదని రిజిజు అన్నారు. రాహుల్ గాంధీ ప్రవర్తన మారుతుందని కానీ, కాంగ్రెస్ మారుతుందని కానీ ఆశించడం లేదని రిజిజు తెలిపారు. ఆ రోజున సుమారు 25 మంది ఎంపీలు స్పీకర్ ఛాంబర్‌లోకి వచ్చారని, తనను.. ప్రధాని మోదీపై ఘాటు వ్యాఖ్యలు చేశారని, కానీ తమ పార్టీ చర్చలను నమ్ముతుందని, ఎంపీలపై భౌతికదాడిని తాము ఎప్పుడూ ప్రోత్సహించలేదని రిజిజు తన పోస్టులో తెలిపారు.

# మహిళల భద్రతా పెన్షన్ పథకాన్ని ప్రారంభించిన కేరళ

## మొదటి దశలో 10 లక్షలకు పైగా లబ్ధి




**తిరువనంతపురం ఫిబ్రవరి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కేరళ ప్రభుత్వం మహిళా భద్రతా పెన్షన్ పథకాన్ని ప్రారంభించింది. ప్రస్తుతం ఉన్న సామాజిక భద్రతా వలయానికి వెలుపల ఉన్న ఆర్థికంగా వెనుకబడిన నేపథ్యాల నుండి వచ్చిన మహిళలు, ట్రాన్స్ జండర్‌లకు ఈ పథకం ప్రత్యక్ష ఆర్థిక సహాయాన్ని అందిస్తుంది. గురువారం తిరువనంతపురంలో జరిగిన ఓ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు, ప్రారంభమైన వెనువెంటనే లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు పెన్షన్ చెల్లింపులు జమయ్యాయి. ఈ పథకం కింద 35 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు గల అర్హులైన లబ్ధిదారులకు నెలకు రూ. 1,000 పెన్షన్ లభిస్తుంది. మొదటి దశలోనే 10,58,752 మంది లబ్ధిదారులకు పింఛన్ అందుకోనున్నారు. దీనికోసం ప్రభుత్వం రూ. 105.87 కోట్లు కేటాయించింది. ఈ పింఛన్ కోసం 15,88,267 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ, లింగ న్యాయం, సామాజిక సమానత్వాన్ని బలోపేతం చేయడానికి ఉద్దేశించిన ఒక ముఖ్యమైన అడుగుగా అభివర్ణించారు. ఈ పెన్షన్, కొంతవరకు ఆర్థిక స్వయంప్రతిపత్తిని అందించడానికి రూపొందించబడింది, మహిళలు, ట్రాన్స్ ఉమెన్ గౌరవంగా, నిర్భయంగా జీవించడానికి వీలు కల్పిస్తుంది అని విజయన్ అన్నారు. 1957లో ఈఎంఎస్ నంబూద్రిపాద్ నేతృత్వంలోని మొదటి వామపక్ష ప్రభుత్వం అందించిన విధానాల ద్వారా కేరళ అభివృద్ధి పథం రూపుదిద్దుకున్నదని ఆయన అన్నారు. సామాజిక పురోగతి కొనసాగింపులో భాగమే ఇటీవల ప్రారంభించిన ఉచిత డిగ్రీ విద్య నిర్ణయమని ఆయన ఉదహరించారు. జెండర్ బడ్జెట్ లో కేరళ యొక్క మార్గదర్శక పాత్రను కూడా ముఖ్యమంత్రి హైలైట్ చేశారు, అన్ని శాఖలలో మహిళల కోసం ప్రణాళిక నిధులలో ప్రత్యేక వాటాను కేటాయించిన మొదటి రాష్ట్రం కేరళ అని పేర్కొన్నారు. ప్రస్తుత బడ్జెట్లో

గణనీయమైన భాగం మహిళా కేంద్రీకృత కార్యక్రమాల వైపు మళ్లించబడిందని ఆయన అన్నారు. 'కుటుంబశ్రీ' వంటి క్షేత్ర స్థాయి కార్యక్రమాలు మహిళల సామూహిక సాధికారతను మరింత బలోపేతం చేసేందుకు ఉపయోగపడతాయని ఆయన అన్నారు. కాగా, ఉద్యోగార్థులైన యువతకు మద్దతు ఇవ్వడానికి ఉద్దేశించిన 'కనెక్ట్ టు వర్క్' స్కాలర్ షిప్ ప్రోగ్రామ్ జనవరి 20న ప్రారంభమైంది. మొదటి దశలో 10,000 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 1,000 చొప్పున జమ చేశారు.

## బిజినెస్

# బంగారం వెండి ధరలు ఎలా ఉన్నాయి?

### రానున్న రోజుల్లో తగ్గుతాయా? పెరుగుతాయా?




గత కొన్ని వారాలుగా బంగారం, వెండి ధరలు తీవ్ర హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి. కొన్ని రోజుల వ్యవధిలో గోల్డ్, సిల్వర్ రెండూ కుప్పకూలి, ఇప్పుడు పెరుగుతున్నాయి. జనవరిలో రికార్డు స్థాయిని తాకిన తర్వాత ఒక్కసారిగా తగ్గిన ధరలు ఇప్పుడు మళ్లీ పుంజుకున్నాయి. అయినప్పటికీ గరిష్టం కంటే ఇప్పటికీ తక్కువగానే ట్రేడవుతున్నాయి.భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గి, పరిస్థితి మెరుగుపడటంతో ధరలు కాస్త తగ్గాయి. అదే సమయంలో అధిక స్థాయిలలో లాభాల బుకింగ్ బంగారం, వెండి ధరలను అదుపులో ఉంచుతుంది. ఇటీవల బంగారం, వెండి ధరలు అన్ని రికార్డులను బద్దలు కొట్టాయి, బంగారం 10 గ్రాములకు రూ.2 లక్షలకు చేరుకుంది, వెండి ధరలు ఇప్పటికే కిలోకు రూ.4 లక్షలను దాటాయి. అప్పటి నుండి బంగారం, వెండి ధరలు తగ్గాయి, కానీ స్వల్పకాలిక అస్థిరత ఇక్కడే ఉన్నప్పటికీ దీర్ఘకాలిక బుల్ రన్ ఇంకా మొదలుకాలేదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అంటే భవిష్యత్తులో ధరలు ఇంకా పెరుగుతాయన్న మాట. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫెడరల్ రిజర్వ్ చైర్ పదవికి తన నామినేట్‌ను ప్రకటించిన తర్వాత జనవరి 30, ఫిబ్రవరి 2 తేదీలలో వరుసగా రెండు సెషన్లలో బంగారం ధర బాగా తగ్గింది. ఇటీవలి దిద్దుబాటు ఉన్నప్పటికీ, పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, నిరంతర ఆర్థిక అనిశ్చితి మద్దతుతో ఈ సంవత్సరం ఇప్పటివరకు బంగారం 17.5 శాతం పెరిగింది. కాగా ఫెడరల్ రిజర్వ్ మరింత దూకుడుగా రేటు కోత విధించనుందనే అంచనాలు పెరగడంతో బుధవారం బంగారం, వెండి ధరలు పెరిగాయి. బుధవారం ముగింపు బులియన్ ధరలు ఇలా ఉన్నాయి.. 22 క్యారెట్ల 1 గ్రాము బంగారం రూ.14,965, 24 క్యారెట్ల 1 గ్రాము బంగారం రూ.16,325లు ఉండగా, కిలో వెండి రూ.2,77,000 లకు చేరుకుంది.

# స్టాక్ మార్కెట్‌లకు షాకిచ్చిన ఐటీ..

### భారీగా నష్టపోయిన సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీగా నష్టాలు మూటగట్టుకున్నాయి. ముఖ్యంగా ఐటీ షేర్ల లో అమ్మకాలు సూచీలపై ఒత్తిడి పెంచాయి. అమెరికాలో జనవరి నెలకు సంబంధించి అంచనాల కంటే మెరుగైన జాబ్స్ డేటా (జీశీఎం ఙఖు) రావడం మన మార్కెట్‌లపై ప్రతికూల ప్రభావం చూపింది. మెరుగైన జాబ్స్ డేటా వల్ల ఇప్పట్లో ఫెడ్ వడ్డీ రేట్లు (ఖీవస =ఫ్‌వం) తగ్గించకపోవచ్చన్న అంచనాలు సెంటిమెంట్‌ను దెబ్బకొట్టాయి. దానికితోడు ఐటీ షేర్లను ఏఐ భయాలు వెంటాడాయి. ఇటీవల వరుస లాభాల వేళ గరిష్ఠాల వద్ద మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడమూ సూచీలపై ఒత్తిడి పెంచింది. ఐటీ స్టాక్స్‌ను ఆంత్రోపిక్ భయాలు ఇంకా వెంటాడుతున్నాయి. దీనికితోడు అమెరికాలో వెలువడిన జాబ్స్ డేటా కూడా ఐటీ షేర్లపై ప్రభావం చూపింది. ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గించకపోతే అమెరికన్



కంపెనీలు తమ ఖర్చులను తగ్గించుకుంటాయి. దాంతో మన ఐటీ కంపెనీలకు ఆర్డర్లు తగ్గుతాయి. ఈ నేపథ్యంలో నేడు ఇన్ఫోసిస్, టీసీఎస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్, విప్రో వంటి ఐటీ కంపెనీల షేర్లు భారీ నష్టాలను చూశాయి. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ దాదాపు 5 శాతం మేర పతనమైంది. బీఎస్‌ఈలో మదుపర్ల సంపదగా భావించే నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.3 లక్షల కోట్లు క్షీణించింది. సెన్సెక్స్ గురువారం ఉదయం 83,968.43 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 84,233.64) నష్టాలతో ప్రారంభమైంది. రోజంతా నష్టాల ఒరవడి కొనసాగింది. ఇంట్రాడేలో 83,516.67 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 558.72 పాయింట్ల నష్టంతో 83,674.92 వద్ద ముగిసింది.నిఫ్టీ 146.65 పాయింట్ల నష్టంతో 25,807.20 వద్ద స్థిరపడింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 90.61గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. బజాజ్ ఫైనాన్స్, ఐసీఐసీఐ బ్యాంక్, ట్రెంట్, బీఈఎల్, ఎస్‌బీఐ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 69 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 5064 డాలర్ల వద్ద ట్రేడవుతున్నది.

# ప్రపంచవ్యాప్తంగా లక్షల కార్లను రీకాల్ చేసిన బీఎండబ్ల్యూ.. ఎందుకో తెలుసా..?

జర్మనీ కి చెందిన ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ సంస్థ బీఎండబ్ల్యూ ప్రపంచవ్యాప్తంగా లక్షల కార్లను రీకాల్ చేసింది. ఇంజిన్ స్టార్టర్లలో నెలకొన్న సాంకేతిక సమస్యతో నిప్పు రాజుకొనే ప్రమాదం ఉండటంతో ఈ రీకాల్ చేస్తున్నట్లు సంస్థ అధికార ప్రతినిధి తెలిపారు. 2020 -2022 మధ్య ఉత్పత్తి చేసిన 16 మోడళ్లలో ఈ సమస్య ఉన్నట్లు ఆ ప్రతినిధి చెప్పారు.దాదాపు 5,75,000 వాహనాలపై ఈ ప్రభావం ఉంటుందని కంపెనీ అంచనా వేసింది. ఈ మోడల్ వాహనాల్లో స్టార్టర్ మోటార్ వ్యవస్థలో సాంకేతిక లోపాలు ఉన్నాయని ఉత్పత్తి తనిఖీలు, కస్టమర్ల నుంచి వచ్చిన ఫిర్యాదుల ద్వారా వెల్లడైందని బీఎండబ్ల్యూ పేర్కొంది. ఎక్కువసార్లు స్టార్ట్ చేయడానికి ప్రయత్నిస్తే అందులోని




మాగ్నెటిక్ స్విచ్‌లు అరిగిపోవడంతో.. కారు స్టార్ట్ అవడం కూడా కష్టతరం అవుతుందని వెల్లడించింది. కొన్ని సందర్భాల్లో ఇది వాహనంలో మంటలు చెలరేగడానికి దారితీయవచ్చని తెలిపింది.

## స్పోర్ట్స్

# 105 రన్స్ తేడాతో శ్రీలంక విజయం

పల్లకెలి

టీ20 వలర్డ్‌కప్ లో రెండో విక్టరీ నమోదు చేసింది శ్రీలంక. ఇవాళ ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో 105 రన్స్ తేడాతో ఆ జట్టు విజయం సాధించింది. గ్రూప్ బీలో భాగంగా జరిగిన మ్యాచ్‌లో తొలుత శ్రీలంక నిర్ణీత ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 225 రన్స్ చేసింది. భారీ టార్గెట్‌తో బరిలోకి దిగిన ఒమన్ 9 వికెట్లు కోల్పోయి కేవలం 120 రన్స్ మాత్రమే చేయగలిగింది.





ఒమన్ బ్యాటర్లలో నదీమ్ 53, వాసిమ్ అలీ 27 రన్స్ చేశారు. లంక బౌలర్లలో దుశమంత చమీరా, మహేశ్ తీక్షణ చెరి రెండేసి వికెట్లు తీసుకున్నారు.శ్రీలంక బ్యాటర్లలో శనక, పవన్ రత్నానాయకే, కుశాల్ మెండిస్ హాఫ్ సెంచరీలు నమోదు చేశారు. దీంతో శ్రీలంక భారీ స్కోరు చేసింది. మెండిస్ 45 బంతుల్లో 61 రన్స్, శనక 20 బంతుల్లో 50, రత్ననాయకే 28 బంతుల్లో 60 రన్స్ చేశారు.

# పసికూనపై ఇషాన్, పాండ్యా పంజా..

### -ప్రపంచకప్‌లో టీమిండియాకు వరుసగా పదో విక్టరీ..!

పొట్టి ప్రపంచకప్‌లో యూఎస్‌ఏపై స్వల్ప తేడాతో నెగ్గిన భారత్.. రెండో మ్యాచ్‌లో పంజా విసిరింది. పాకిస్థాన్‌తో మ్యాచ్‌కు రెడీ అంటూ టాప్ గేర్ ఆటతో నమీబియాను చిత్తు చేసింది. ఓపెనర్ ఇషాన్ కిషన్(61) ఊచకోతకు, హార్దిక్ పాండ్యా(52)ల మెరుపులు తోడవ్వగా.. ప్రత్యర్థికి 210 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించిన టీమిండియా 93 పరుగుల తేడాతో గెలుపొందింది. భారీ ఛేదనలో ఓపెనర్లు దూకుడుగా ఆడినా.. వరుణ్ చక్రవర్తి(3-7) ఒకే ఓవర్లో రెండు వికెట్లతో ప్రత్యర్థిని దెబ్బకొట్టాడు. చివరి బ్యాటర్ గ్రీన్ షాట్ ఆడబోగా వికెట్లకు తాకడంతో టీమిండియా పొట్టి కప్‌లో వరుసగా పదో విజయం నమోదు చేసింది. ఆతిథ్య భారత జట్టు ప్రపంచకప్‌లో అదిరే ప్రదర్శన చేసింది. యూఎస్‌ఏపై తేలిపోయిన టాపార్డర్.. ముఖ్యంగా ఓపెనర్ఇషాన్ కిషన్(61) నమీబియాపై పిడుగల్లే విరుచుకుపడగా.. హార్దిక్ పాండ్యా(52) విధ్వంసంతో జట్టుకు కొండంత స్కోర్ అందించాడు. అనంతరం బంతితో వరుణ్ చక్రవర్తి(3-7) మ్యాజిక్ చేయగా ప్రత్యర్థి బ్యాటర్లు క్రీజులో నిలవలేకపోయారు. బ్యాటుతో మెరిసి, రెండు వికెట్లు తీసిన పాండ్యా ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. 93 పరుగుల విజయంతో ఆదివారం పాకిస్థాన్‌తో మ్యాచ్‌కు మేము రెడీ అని హెచ్చరికలు పంపింది టీమిండియా.




**వరుణ్ మ్యాజిక్..**

టీమిండియా నిర్దేశించిన భారీ ఛేదనను నమీబియా ఓపెనర్లు దూకుడుగా ఆరంభించారు. లోరెన్ స్టీన్‌కాంప్(29), జన్ ఫ్రైలింక్(22)లు భారత పేసర్లను ఒత్తిడిలో పడేస్తూ బౌండరీలతో చెలరేగారు. ఈ జోడీని అర్ష్‌దీప్ సింగ్(1-36) విడదీసి తొలి బ్రేకిచ్చాడు. కానీ, వరుణ్ చక్రవర్తి మలుపు తిప్పాడు. 10వ ఓవర్లో రెండు వికెట్లు తీసి నమీబియాను కష్టాల్లోకి నెట్టాడు. ఆ తర్వాతి ఓవర్లో కెప్టెన్ ఎరాస్మస్ (18) ఔటయ్యాడు. అక్షర్ పటేల్ ఓవర్లో రెండు సిక్సర్లు బాదిన అతడు..ఈసారి మరోషాట్‌కు యత్నించి తిలక్ వర్మ చేతికి చిక్కాడు.. అంతే.. 88కే ఐదు వికెట్లు పడ్డాయి. బుమ్రా డైవింగ్ క్యాచ్‌తో మలన్ కుర్గర్(5)ను పెవిలియన్ పంపగా అప్పటికే నమీబియా ఓటమి ఖాయమైంది. కాసేపు ప్రతిఘటించిన రూబెన్ ట్రంపుల్‌మన్(6)ను బుమ్రా బౌల్డ్ చేయగా.. హార్దిక్ తన చివరి ఓవర్లో వరుసగా ఇద్దరిని ఔట్ చేసి హ్యాట్రిక్‌పై నిలిచాడు. చివరి బ్యాటర్ గ్రీన్ షాట్ ఆడబోగా వికెట్లకు తాకడంతో టీమిండియా పొట్టి కప్‌లో వరుసగా పదో విజయం నమోదు చేసింది. ఈ ఎడిషన్‌లో రెండో విజయంతో సూర్యకుమార్ సేన గ్రూప్ ఏ పట్టికలో అగ్రస్థానానికి దూసుకెళ్లింది.

**చితక్కొట్టిన పాండ్యా, ఇషాన్**

పొట్టి ప్రపంచకప్ ఆరంభ పోరులో తేలిపోయిన భారత బ్యాటర్లు నమీబియాపై ఉతికేశారు. ఓపెనర్ ఇషాన్ కిషన్(61) తుఫాన్ ఇన్నింగ్స్‌తో చెలరేగి ప్రత్యర్థి బౌలర్ల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీశాడు.. మెరుప అర్ధశతకంతో భారీస్కోర్‌కు పునాది వేసిన ఇషాన్ ఔట్‌కాగానే.. మిడిలార్డర్ అతడిని అనుసరించారు. అయితే.. ఆఖర్లో హార్దిక్ పాండ్యా(52), శివం దూబే(23)లు తమ స్టయిల్ మెరుపులతో ఫినిషింగ్ టచ్ ఇచ్చారు. ఆఖరి రెండు ఓవర్లలో నాలుగు వికెట్లు పడడంతో 208కే టీమిండియా పరిమితమైంది. లేదంటే.. 220 పైగా స్కోర్ చేసేది.

# అనామక జట్టు చేతిలో చిత్తైన నేపాల్..!




పొట్టి ప్రపంచకప్‌లో సంచలనం నమోదైంది. చిన్న జట్టు ఇటలీ (ఃఖుశ్రీఎ) అరంగేట్రంలోనే 'మాతో జాగ్రత్త' అనే హెచ్చరికలు పంపుతూ.. బోణీ కొట్టింది. గత మ్యాచ్‌లో ఇంగ్లండ్‌ను వణికించిన నేపాల్(చీవజుఖుశ్రీ)ను గడగడ వణికిస్తూ జయభేరి మోగించింది. ఓపెనర్ల విధ్వంసంతో 124 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఉఫ్‌మని ఊదేసి.. 'మేము చెలరేగితే ఇలా ఉంటది' అని చాటింది. ఊహించని ఓటమితో నేపాల్ షాక్‌లో కూరుకుపోయింది.సంచలనాలకు నెలవైన టీ20 ప్రపంచకప్‌లో ఇటలీ చరిత్ర లిఖించింది. అనామక జట్టుగా మెగాటోర్నీలో అడుగుపెట్టి.. తొలి విజయంతో అందర్నీ ఆశ్చర్యపరిచింది. ముంబైలోని వాంఖడే స్టేడియంలో గురువారం ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన ఇటలీ.. గ్రూప్ సీలోని నేపాల్‌కు చెక్ పెట్టింది. మొదట కృష్ణన్ కలుగమగే(3-18), బెన్ మనేటి (2-9)లవిజృంభణతో ప్రత్యర్థిని 123కే ఆలౌట్ చేసిన యూరోపియన్ జట్టు.. ఛేదనలోనూ రఫ్ఫాడించింది.

ఓపెనర్లే కొట్టేశారు..

లక్ష్యం చిన్నది కావడంతో.. ఓపెనర్లు జస్టిన్ మొస్కా(60 నాటౌట్), ఆంథోని మొస్కా (62 నాటౌట్)లు విరుచుకుపడ్డారు. నేపాల్ బౌలర్లకు దడ పుట్టించిన ఈ సోదరులు బౌండరీలతో చెలరేగగా.. చూస్తుండగానే లక్ష్యం కరిగిపోయింది. తద్వారా పొట్టి వరల్డ్‌కప్‌లో అత్యధిక భాగస్వామ్యం (124 నాటౌట్) నెలకొల్పిన సోదర ద్వయంగా వీరు గుర్తింపు సాధించారు.నిరుడు వెస్టిండీస్‌పై టీ20 సిరీస్ విజయంతో వార్తల్లో నిలిచిన నేపాల్ ప్రపంచకప్‌లో పెద్ద జట్లకు షాకిస్తుందనుకుంటే సీన్ రివర్సైంది. డేంజరస్ రోహిత్ పౌడెల్(23), దీపేంద్ర సింగ్ ఐరీ(17), గుల్సన్ జా(3)లను ఔట్ చేసి నేపాల్‌ను తక్కువకే కట్టడి చేసిన కలుగమగె 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికయ్యాడు.